# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక




ఎయిమ్స్ అభివృద్ధికి

## పెమ్మసాని అడుగులు

2 లో..


అమలాపురం | సంపుటి : 10 సంచిక : 42 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | గురువారం 03 ఏప్రిల్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 42 03-04-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




## మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులతో పదవులు వస్తాయని

# అనుకోవద్దు...

- కార్యకర్తలతో మీటింగ్‌లో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు
- పనితీరు ఆధారంగానే నామినేటెడ్, పార్టీలో పదవులని స్పష్టం చేసిన చంద్రబాబు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంతటి వారినైనా పక్కన పెడతామని హెచ్చరిక

అమరావతి మార్చి 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పార్టీ కార్యకర్తల సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం ఆశ్చర్యపోయేలా తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. బాపట్ల జిల్లా చినగంజాం మండలం కొత్తగొల్లపాలెంలో పర్చూరు నియోజకవర్గ ముఖ్యనేతలు, కార్యకర్తలతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు ఒక హెచ్చరిక జారీ చేశారు. కేవలం మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులతో పదవులు ఇవ్వబోమని స్పష్టం చేశారు. పోలింగ్ బూత్ స్థాయిలో పార్టీకి అత్యధిక ఓట్లు సాధించేలా కృషి చేసిన వారిని గుర్తిస్తామని చెప్పారు. పనితీరును ప్రామాణికంగా తీసుకుని నేతలు, కార్యకర్తలకు నామినేటెడ్, పార్టీ పదవులు కేటాయించడం జరుగుతుందన్నారు. తనతో సహా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకుల పనితీరుపై ఎప్పటికప్పుడు విశ్లేషణ చేసి రేటింగ్‌లు ఇస్తామని చెప్పారు. దాని ద్వారా పనితీరును మెరుగుపర్చుకోవాల్సి ఉంటుందన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంతటి వారినైనా పక్కన పెడతానని హెచ్చరించారు. సమర్థులకు అవకాశం కల్పిస్తామని చంద్రబాబు పేర్కొన్నారు.



## బర్డ్ ఫ్లూతో..

# రెండేళ్ల చిన్నారి మృతి

**గత నెలలో అనారోగ్యానికి గురైన జ్యోతి -మంగళగిరి ఎయిమ్స్‌లో చికిత్స**

**బర్డ్ ఫ్లూ లక్షణాలతో గత వారం మృతి- నిర్ధారించిన పూణెలోని వైరాలజీ ల్యాబ్**

అమరావతి మార్చి 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్‌లో బర్డ్‌ఫ్లూ (ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా/హెచ్5ఎన్1) బారినపడి రెండేళ్ల చిన్నారి మృతి చెందడం కలకలం రేపుతోంది. గుంటూరు జిల్లా నరసరావుపేటలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. పట్టణంలోని బాలయ్యనగర్‌కు చెందిన పెండ్యాల జ్యోతి (2) బర్డ్‌ఫ్లూతో ప్రాణాలు కోల్పోయినట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు నిన్న ధ్రువీకరించారు. జ్యోతి గత నెలలో అనారోగ్యానికి గురైంది. కుటుంబ సభ్యులు ఆమెను మంగళగిరిలోని ఎయిమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ వారం రోజుల క్రితం మృతి చెందింది. అయితే, ఆమెలో బర్డ్ ఫ్లూ లక్షణాలు కనిపించడంతో అనుమానించిన వైద్యులు నమూనాలను పూణెలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపారు. తాజాగా, ఈ పరీక్షలకు సంబంధించిన నివేదిక ఆసుపత్రికి అందింది. పరీక్షల్లో జ్యోతికి బర్డ్ ఫ్లూ సోకినట్టు నిర్ధారణ అయినట్టు వైద్యాధికారులు తెలిపారు.

# తితిదేపై సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి మార్చి 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) పై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. భక్తుల సౌకర్యాలు మెరుగుపరిచేందుకు గత 9 నెలల్లో తీసుకున్న చర్యలపై తితిదే అధికారులు సీఎం ఎదుట ప్రజంటేషన్ ఇచ్చారు.

భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా భవిష్యత్‌లో చేపట్టాల్సిన చర్యలపై సీఎం దిశానిర్దేశం


- తరువాయి 2లో..

# పట్టాలు తప్పిన నాగావళి ఎక్స్‌ప్రెస్

విజయనగరం మార్చి 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

విజయనగరం రైల్వేస్టేషన్ సమీపంలో ప్రయాణికులతో వెళ్తున్న నాగావళి ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. విజయనగరం రైల్వే స్టేషన్ నుంచి బొబ్బిలి వైపు వస్తుండగా ఈ ఘటన జరిగింది. రైలులోని చివరి రెండు బోగీలు

- తరువాయి 2లో..



# కొడాలి నానికి సర్జరీ పూర్తి..



అమరావతి మార్చి 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మాజీ మంత్రి కొడాలి నాని హార్ట్ ఆపరేషన్ సక్సెస్ అయ్యింది. ఈ రోజు ముంబైలోని ఏషియన్ హార్ట్ కేర్ సెంటర్ లో ఆయనకు బైపాస్ సర్జరీ నిర్వహించారు. చీఫ్ సర్జన్ డాక్టర్ రమాకాంత్ పాండే నేతృత్వంలో దాదాపు 8 గంటల పాటు ఈ సర్జరీ నిర్వహించారు. సర్జరీ విజయవంతంగా పూర్తి కావడంతో నాని సన్నిహితులు, వైసీపీ శ్రేణులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో కొడాలి నాని ఉన్నారు. మరో వారం రోజుల్లో నానిని డిశ్చార్జ్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. గ్యాస్ట్రిక్ సమస్యతో వారం రోజుల కిందట గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో కొడాలి నాని చేరారు. నానికి అక్కడ వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు ఆయనకు గుండెకు సంబంధించిన 3 వాల్వ్ క్లోజ్ అయినట్లు నిర్ధారించారు. స్టంట్ లేదా బైపాస్ సర్జరీ కోసం సూచించారు. అయితే సర్జరీ చేసేందుకు కొడాలి నాని ఆరోగ్య పరిస్థితి సహకరించదని ఏఐజీ వైద్యులు అంచనాకు వచ్చినట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కొడాలి నానిని సోమవారం మెరుగైన చికిత్స కోసం ఎయిర్ అంబులెన్స్‌లో ముంబైకి తరలించారు. ముంబైలోని ఏసియన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్ లో ఆయనకు డాక్టర్ రమాకాంత్ పాండా ఆధ్వర్యంలో బైపాస్ సర్జరీ జరిగింది.

డాక్టర్ పాండాకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుంది. గతంలో మాజీ ప్రధాని, దివంగత నేత మన్మోహన్ సింగ్ ,

- తరువాయి 2లో..

## తప్పుడు ప్రచారాలు చేస్తే

# సహించను...

**రెడ్ బుక్ లోకి ఎక్కిస్తా: మంత్రి లోకేశ్**



అమరావతి మార్చి 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

సీబీఎన్ పీ4 విధానానికి రిలయన్స్ సీబీజీ ప్లాంట్లతో నాంది అన్న మంత్రి

అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ సింగిల్ టార్గెట్‌గా వెల్లడి

కనిగిరి ప్రాంతంలోనే 50 సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్న లోకేశ్

త్వరలోనే కనిగిరి ట్రిపుల్ ఐటీకి శంకుస్థాపన చేస్తామని వ్యాఖ్య


రిలయన్స్ సీబీజీ ప్లాంట్లతో 2.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలన్న మంత్రి

సీఎం చంద్రబాబునాయుడు చెప్పిన పీ4 విధానానికి రిలయన్స్ సీబీజీ ప్లాంట్స్ నాంది కాబోతున్నాయని, పేదరికం లేకుండా చేయడంలో ఇదొక ముఖ్యమైన అడుగు కాబోతోందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రకాశం

- తరువాయి 2లో..

## మాజీ ఎంపీ హర్ష కుమార్‌కు

# నోటీసులు..!



అమరావతి మార్చి 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మాజీ పార్లమెంటు సభ్యులు హర్ష కుమార్ కు ఊహించని షాక్ తగిలింది. మాజీ ఎంపీ హర్ష కుమార్ కు తాజాగా పోలీసులు నోటీసులు జారీ చేశారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి పై హర్ష కుమార్ అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ తరుణంలోనే హర్ష కుమార్ కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. స్వచ్ఛ దారాలు ఉంటే తీసుకొని దర్యాప్తుకు రావాలని రాజమండ్రి నార్త్ జోన్ డిఎస్పి నోటీసులో స్పష్టం చేశారు.

మాజీ ఎంపీ హర్ష కుమార్ అండర్ సెక్షన్ 194 బీఎన్ఎస్ఎస్ చట్టం కింద పోలీసులు కేసు

రాజానగరం పోలీస్ స్టేషన్ నుంచి క్రైమ్ నెంబర్ 136/2025 పేరుతో నోటీసులు పంపగా.. అండర్ సెక్షన్ 194 బీఎన్ఎస్ఎస్ చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రవీణ్ కుమార్ పగడాల మృతిపై హర్షకుమార్ మీ వద్ద ఏమైనా సమాచారం ఇవ్వమని గతంలో ఒకసారి అడిగాం. మరోసారి అడుగుతున్నాం. మీ దగ్గర ఏదైనా ఆధారాలు ఉంటే సీసీ ఫొటోస్ కానీ.. సీసీ ఫుటేజీ వీడియోలు.. ఇంకెమైనా ఆధారాలు ఉంటే రేపు సాయంత్రం 5 గంటలకు రాజానగరం పోలీస్ స్టేషన్ కు రావాలి అని పోలీసులు నోటీసుల్లో పేర్కొన్నారు. అనవసరంగా తప్పుడు ఆరోపణలు చేయకూడదని.. కోరడం జరిగింది.

రాజనగరం పోలీసులు ఇచ్చిన నోటీసులకు హర్ష కుమార్ స్పందించారు. మీరు నాకు నోటీసులు ఇవ్వడం

- తరువాయి 2లో..

తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## అవివేక మార్గంలో అగ్రరాజ్యం

1990లలో, న్యూయార్క్‌లోని బ్రాడ్‌వేలో పర్యటిస్తున్న చైనా ప్రతినిధి బృందం గురించి 'న్యూయార్క్ టైమ్స్' ఒక నివేదికను ప్రచురించింది. ఇతిహాసాల రంగస్థల, సంగీత, వినోద ప్రదర్శన క్షేత్రాల కూడలిగా ప్రసిద్ధి చెందిన 'బ్రాడ్‌వే' అభివృద్ధి, నిర్వహణల గురించి అధ్యయనం చేసి షాంఘై లేదా బీజింగ్‌లో సరిగ్గా అటువంటి సాంస్కృతిక బహుళస్థలిని ఎలా వృద్ధి చేయవచ్చో తెలుసు కోవడమే ఆ సందర్శకుల లక్ష్యం. అమెరికా శక్తి... దాని సైన్యంలో మాత్రమే కాదు, దాని శక్తిమంతమైన సంస్కృతిలో కూడా ఉందని చైనీయులు బాగా అర్థం చేసుకున్నారు. ఒక దేశ 'శక్తి'కి ప్రామాణికమైన లక్షణం ఏమిటంటే, ఇతర దేశాలు తనను అనుకరించేలా స్వీయ విధానాలను రూపొందించు కోగలిగిన సామర్థ్యమే. అది సైనిక శక్తి కావచ్చు, ఆర్థికపరమైన దృఢ శక్తి కావచ్చు. సంస్కృతి, విలువలు, భావజాలంతో ఆ దేశం ప్రతిఫలించే సమ్మోహన శక్తి ద్వారా ఆ అనుకరణ మరింత సులభంగా జరుగుతుంది.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత నాలుగేళ్లపాటు, అమెరికా అణ్వాయుధాలపై గుత్తాధిపత్యాన్ని కలిగి ఉంది. అదే సమయంలో యూరప్ పునరుజ్జీవనానికి 'మార్షల్ ప్లాన్ 'ను ప్రారంభించింది. పైగా తన ప్రపంచ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి నాటో సైనిక కూటమిని సృష్టించింది. అదే మార్షల్ ప్లాన్... ఆర్థిక, ఆరోగ్య, వాణిజ్య రంగాలలో ప్రజోపయోగ వస్తుసేవలను అందుబాటులోకి తెచ్చి ప్రపంచంపై తన ఆధిపత్యాన్ని ప్రదర్శించటానికి వీలుగా ఐక్య రాజ్యసమితిని, ప్రపంచ బ్యాంకును, అంతర్జాతీయ ద్రవ్య నిధిసంస్థను, ప్రపంచ ఆరోగ్య సంస్థను, వాణిజ్య సుంకాలపై సాధారణ ఒప్పందాన్ని(గాట్) నెలకొల్పేందుకు కూడా అమెరికాకు తోడ్పడింది.

ప్రపంచవ్యాప్తంగా అమెరికా సాంస్కృతిక ఆకర్షణ విస్తృతం అవుతున్న కొద్దీ ఈ అంతర్జాతీయ సంస్థలు అమెరికా శక్తికి మరింత బలం చేకూర్చే సాధనాలుగా మారాయి. ఈ క్రమంలోనే ఇప్పుడు అమెరికా తన ప్రధాన దాతృత్వ సంస్థ అయిన 'యుఎస్ ఎయిడ్'ని మూసి వేయడం ద్వారా, ఇప్పటివరకు తన శక్తిని వినియోగించుకుని అభివృద్ధి చేసుకున్న ఆధిపత్యాన్ని తానే దెబ్బతీసుకోబోతున్నట్లు కనిపిస్తోంది.

'యుఎస్ ఎయిడ్' ప్రపంచంలోనే అభివృద్ధి సహాయానికి సంబంధించి అతి పెద్ద దాతృత్వ సంస్థ. ఆ సంస్థ ఏటా అందించే 70 బిలియన్ డాలర్లను ఉక్రెయిన్, జోర్డాన్, పాలస్తీనా వంటి వ్యూహా త్మక ప్రయోజనాలు కలిగిన దేశాలకు, అలాగే తను మానవతా సహాయం అందించిన (సూడాన్, యెమెన్, దక్షిణ సూడాన్, ఆఫ్ఘనిస్తాన్) దేశాలకు అమెరికా పంపిణీ చేసింది.

ఆధిక్యశక్తి (హార్డ్ పవర్) స్థానంలో ఔదార్య శక్తి (సాఫ్ట్ పవర్)ని ప్రయోగించటం అమెరికా స్థిరమైన వ్యూహం. ఈ విధానాన్ని భారత్‌తో సహా ఇతర దేశాలు అనుసరించడానికి ప్రయత్నించాయి. 1950లు, 60లలో ఆరోగ్య, వ్యవసాయ, ఆహార, విద్యారంగాలలో భారత అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో యుఎస్ ఎయిడ్ ముఖ్య పాత్ర పోషించింది. అదే సమయంలో పాక్‌ను ఆయుధీకరించే తన విధానం నుండి ఉత్పన్నమయ్యే భారతీయ అసంతృప్తిని మళ్లించ టానికి యుఎస్ ఎయిడ్‌ను అమెరికా తెలివైన మార్గంగా చేసుకుంది.

అమెరికా తన సాఫ్ట్ పవర్‌ను విదేశీ సహాయ నగదు నిధుల ద్వారా మాత్రమే కాక, నాలుగు ప్రధాన అంశాల ద్వారా కూడా ప్రయోగించింది. మొదటిది %–% వినోదం, మీడియా, పరిశ్రమలు, విద్యా వ్యవస్థ. రెండవది %–% ప్రజాస్వామ్యం, సమానత్వం, మానవ హక్కుల పట్ల, అలాగే శక్తివంతమైన పౌర సమాజం పట్ల తన నిబద్ధత. మూడవది %–% ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంకులు మొద లైనవి. నాల్గవది %–% తన చురుకైన వినియోగదారీ ఆధారిత ఆర్థిక వ్యవస్థ. వీటన్నిటితో కూడిన 'సాఫ్ట్ పవర్'తో రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అమెరికా తన హోదాను నిలుపుకొంది.

విద్యార్థులు, పరిశోధకులు, అవకాశాల కోసం చూస్తున్న వ్యాపారవేత్తలు, కళాకారులు, ప్రదర్శకులుబీ అలాగే చట్టబద్ధమైన లేదా చట్టవిరుద్ధమైన మార్గాల ద్వారా పెద్ద సంఖ్యలో అమెరికాకు తరలివచ్చిన కార్మికులలో అమెరికాకు ఉన్న ఈ 'సాఫ్ట్ పవర్' ఎంతో ఆకర్షణను కలిగించింది. ప్రపంచవ్యాప్తంగా, అమెరికా ఒక గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థగా, సంక్షేమ రాజ్యంగా, సాంకేతిక విజ్ఞానంలో లీడర్‌గా ప్రశంసలు అందుకుంది. తద్వారా అమెరికా సంస్కృతికి, ఫ్యాషన్లకు విస్తృతంగా అనుకరణలు ప్రారంభం అయ్యాయి. ఈ కారణంగా ఇతర అగ్ర రాజ్యాల విధానాలలో లేని పరోపకార ధోరణి అమెరికా విధానాలలో ఉందనే అభిప్రాయం కూడా ఏర్పడింది.

కానీ నేడు ఇవన్నీ తిరగబడుతున్నాయి. ట్రంప్ పాలనలోని 'అమెరికా ఫస్ట్' విధానం అమెరికా ప్రయోజనాలనే అన్నింటికంటే ముందు ఉంచడానికి ప్రయత్నిస్తుంది. 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల తీర్పును రద్దు చేయడానికి లేదా కళంకం లేని న్యాయ వ్యవస్థపై దాడి చేయడానికి అమెరికా అధ్యక్షుడు చేసిన ప్రయత్నం ప్రజా స్వామ్యంలోని ముఖ్యమైన వ్యవస్థలను దుర్బలం చేసింది. అమెరికాలో విశ్వవిద్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా తోపాటు చర్చిలు కూడా నేడు దాడికి గురవుతున్నాయి. ఇవన్నీ 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' (మాగా) ఉద్యమం డిమాండ్లకు అనుగుణంగా ఉండాలన్న సంకేతాలను ఆయన పంపుతున్నారు. వైట్ హౌస్ ఆదేశాల ఉల్లంఘనలకు గాను విశ్వవిద్యాలయాలు డబ్బును తిరిగి చెల్లించాలని ట్రంప్ బెదిరించడం అమెరికన్ సంస్కృతిని వర్ణించే మేధా పరమైన స్వేచ్ఛను దెబ్బతీస్తుంది. నిజంగా ఉన్నాయో, లేవో తెలియని గ్రహాంతరవాసుల మాదిరిగా ట్రంప్ పరిపాలన విదేశీయులు, వీసా హోల్డర్లు, పర్యాటకులు, శాశ్వత నివాసితులు లేదా గ్రీన్ కార్డ్ హోల్డర్ల జీవితాన్ని కష్టతరం చేస్తోంది. ఈ చర్యలు అమెరికన్ 'సాఫ్ట్ పవర్' గుండెకాయపైనే దాడి చేస్తాయి.అమెరికా సాఫ్ట్ పవర్‌ను చూసి ప్రపంచం అసూయ చెందేది. కానీ నేడు, షాంఘై, బీజింగ్‌లు కూడా 'బ్రాడ్‌వే' తరహా సాంస్కృతిక కేంద్రాలను కలిగి ఉన్నాయి. సంస్కృతితో పాటు కన్ఫ్యూషియస్ ఇన్‌స్టిట్యూట్‌లు, స్కాలర్‌షిప్‌ల ద్వారా చైనీస్ భాషను ప్రోత్సహించ డానికి విద్యార్థులను చైనా ఆకర్షిస్తోంది. ఇది సాఫ్ట్ పవర్ మరొక లక్షణం. భారతదేశం సంక్లిష్టమైన విదేశాంగ విధాన సవాళ్లను అధిగ మించడానికి సాఫ్ట్, హార్డ్ పవర్ మిశ్రమాన్ని ఉపయోగిస్తోంది.

దాంతో భారత్ విదేశీ విద్యార్థులకు ప్రధాన గమ్యస్థానం అయింది.ఈ హైపర్%–%రియలిస్ట్ యుగంలో సాఫ్ట్ పవర్ ఏమంత ముఖ్యం కాదని చెప్పడం సులభమే. కానీ వాస్తవం ఏమిటంటే, హార్డ్ పవర్ దానికదిగా... సాఫ్ట్, హార్డ్‌లు కలిసిన 'స్మార్ట్ పవర్' సాధించగల సామర్థ్యాన్ని పొందలేదు. లేకుంటే, చైనా లేదా రష్యా... ప్రపంచంలో అత్యంత వాంఛనీయమైన దేశాలుగా పరిగణన పొందేవి. నిజానికి ధనిక దేశాలకు, లేదా మధ్య ఆదాయ దేశాలకు, అమెరికా ఇష్టమైన ఎంపిక! ఎందుకంటే తమ జీవితాలను మెరుగుపరచుకోవాలని కోరుకునే లక్షలాది వలసదారులకు అమెరికానే అనువుగా ఉంది.

ట్రంప్ అధికారంలో ఉన్నప్పటికీ సినిమాలు, సంగీతం, సాంకేతికత ద్వారా అమెరికా ప్రపంచవ్యాప్తంగా తన ప్రాధాన్యాన్ని నిలుపుకొనే అవకాశం ఉంది. కానీ మిత్రదేశాల విశ్వాసాన్ని తక్కువగా అంచనా వేయడం అగ్రరాజ్యానికే దెబ్బ. అలాగే, అమెరికా విలువలు, లక్ష్యాల పట్ల ప్రపంచానికి ఉన్న అభిప్రాయాన్ని మార్చడం కూడా ఆ దేశానికే నష్టదాయకం. వీటన్నిటి వల్ల 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' విధానం ప్రపంచంలో అమెరికాకు ఉన్న ఇమేజ్‌ను దెబ్బతీస్తుంది. దాని దీర్ఘకాలిక ప్రభావాన్ని కూడా తగ్గిస్తుంది.

# ఎయిమ్స్ అభివృద్ధికై పెమ్మసాని అడుగులు

**ఆస్పత్రి మౌలిక సదుపాయాలను పెంచాలి**

**1,054 పోస్టులను మంజూరు చేయాలి**

**కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ కు వివరించిన పెమ్మసాని**

**ఎయిమ్స్ కు ఏటా రూ. 250 కోట్లు కేంద్రం నుంచి అదనంగా అందే అవకాశం పెమ్మసాని**

గుంటూరు, ఏప్రిల్ 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆచరణలో మెలకువ, మాటకు కట్టుబడే నిబద్ధత కలిగిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని తన నెక్స్ట్ డెవలప్మెంట్ టార్గెట్ ను ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్సెస్ (ఎయిమ్స్) వైపు గురి పెట్టారు. ఆర్‌ఓబి, రహదారులు, గుంటూరు ఛానల్ వంటి అభివృద్ధి కార్యక్రమాలను నెలల వ్యవధిలోనే గుంటూరుకు సాధించుకు వచ్చిన ఆయన ఇప్పుడు తన లక్ష్యాన్ని ఎయిమ్స్ హాస్పిటల్ అభివృద్ధి వైపు మళ్ళించారు. ఎయిమ్స్ సామర్థ్యాన్ని పెంచే విధంగా 1,054 పోస్టులను భర్తీ చేయడంతో పాటు పలు మౌలిక సదుపాయాల కల్పనను కోరుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం ఢిల్లీ కార్యాలయంలో కలిసి వివరించారు. ప్రతిపాదనలను సావధానంగా ఆలకించిన తరువాత ఆమె సుముఖంగా స్పందించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ ఈ ప్రయత్నం ద్వారా ఏటా సుమారు రూ. 250 కోట్లను ఎయిమ్స్ కు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం అదనంగా భరిస్తుందని తెలిపారు.





**ం మాట ఇచ్చాను - మరువను**

గడిచిన ఫిబ్రవరి 28న గుంటూరు పార్లమెంట్ పరిధిలోని నిర్మితమైన ఎయిమ్స్ ఆసుపత్రిని పెమ్మసాని పరిశీలించిన అనంతరం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో భాగంగా ఎయిమ్స్ అవసరాలు అదనపు సౌకర్యాలతో పాటు సిబ్బంది వైద్యుల లోటు అంశాలపై ఆయన క్షుణ్ణంగా సమీక్షించారు. సమీక్షలో భాగంగా ఎయిమ్స్ కు కావాల్సిన సౌకర్యాలను కేంద్రంతో మాట్లాడి ఏర్పాటు చేస్తానని మాట ఇచ్చాను, మర్చిపోనని ఆనాడే పెమ్మసాని అధికారులు, వైద్యులకు స్పష్టం చేశారు. ఇచ్చిన మాటకు అనుగుణంగా అడుగులు వేస్తున్నారు. ప్రతిపాదనలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో భాగంగా ఎయిమ్స్ ప్రధాన భూమిక పోషిస్తుందని విజయవాడ - గుంటూరు పరిధిలో నిర్మితమైన ఎయిమ్స్ కు ఇరు జిల్లాల ప్రజలు ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. అయితే అందులో ఉన్న సిబ్బంది, సదుపాయాల కొరత ఆసుపత్రి వైద్య విధానంపై ప్రభావం చూపుతుందన్నారు. మీరు కూడా అందుకు పరిష్కారంగా

లి 105 ఫ్యాకల్టీ పోస్టులు

లి సీనియర్ అసిస్టెంట్ పోస్టులు

లి జూనియర్ రెసిడెంట్ పోస్టులు

లి నర్సింగ్ క్యాడర్ పోస్టులు

లి నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

లి సెంట్రల్ ఇన్స్టిట్యూట్ కమిటీ ఆమోదించిన ప్రకారం 960 పడకలను అందుబాటులోకి తేవాలని కోరారు.

కాబట్టి తమ ప్రతిపాదనను అత్యంత ప్రాముఖ్యతతో పరిగణించి త్వరగా అనుమతులను మంజూరు చేయాలని ఆయన తెలిపారు. కాగా ప్రతిపాదనలను పూర్తిగా ఆలకించిన పిదప కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి పాజిటివ్ గా స్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతికి మోదీ, ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు ఎల్లప్పుడూ సహకరిస్తాయని స్పష్టం చేశారు ఆంధ్రప్రదేశ్ కు, ఏపీ ప్రజలకు ముఖ్యంగా గుంటూరు ప్రజల సౌకర్యార్థం తప్పక సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.

## తితిదేపై సీఎం చంద్రబాబు సమీక్ష

చేశారు. దర్శనాలు, వసతితో పాటు వివిధ సేవలపై భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయాలపైనా చర్చించారు. బ్రహ్మోత్సవాలు, రథసప్తమి, వైకుంఠ ఏకాదశి వంటి ప్రత్యేక సమయాలతో పాటు సాధారణ రోజుల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సీఎం సమీక్షించారు. శ్రీవారి లడ్డు, అన్నప్రసాదంలో తీసుకొచ్చిన మార్పులపై అధికారులు నివేదిక అందించారు. గ్యాలరీల్లో సౌకర్యాల పెంపు, మరింత మంది భక్తులకు కనిపించేలా మాడవీధుల్లో ఏర్పాట్లను అధికారులు వివరించారు. అలిపిరిలో ఉన్న భక్తుల కోసం బేస్ క్యాంప్ నిర్మాణం, పద్మావతి అమ్మవారి దేవాలయం అభివృద్ధికి ప్రణాళిక, అమరావతిలో శ్రీవారి ఆలయం అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సీఎం చర్చించారు. వీటికి సంబంధించిన నమూనాలను ఆయన పరిశీలించారు. రాష్ట్రం వెలుపల నిర్మాణంలో ఉన్న శ్రీవారి ఆలయాల పురోగతిపై అధికారులు నివేదిక అందించారు. తిరుమల ప్రతిష్ఠ పెంచడంతో పాటు భక్తులకు మరింత దగ్గర చేయడం, సులభమైన, సౌకర్యవంతమైన సేవలకు సంబంధించిన వివరాలను సీఎం చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు.

## పట్టాలు తప్పిన నాగావళి ఎక్స్‌ప్రెస్

వెంకటలక్ష్మి థియేటర్ కూడలి వద్ద పట్టాలు తప్పాయి. రైలు నెమ్మదిగా వెళ్లడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. రైల్వే అధికారులు పట్టాలు తప్పిన బోగీలను తొలగించి మిగిలిన రైలును యథావిధిగా పంపించారు.

## కొడాలి నానికి సర్జరీ పూర్తి..

లాలూ ప్రసాద్ యాదవ్, కొనకళ్ల నారాయణ, రఘురామకృష్ణంరాజు తదితర ప్రముఖులకు ఆయనే బైపాస్ సర్జరీ చేశారు. ఇప్పుడు కొడాలి నాని బైపాస్ సర్జరీ సైతం విజయవంతంగా పూర్తి చేశారు.

## తప్పుడు ప్రచారాలు చేస్తే సహించను...

జిల్లా కనిగిరి నియోజకవర్గం పిసిపల్లి మండలం దివాకరపురంలో రిలయన్స్ సంస్థ ఆధ్వర్యాన ఏర్పాటు చేయనున్న కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంటుకు మంత్రి లోకేశ్ బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ ప్రసంగించారు.

**నైపర్ గడ్డితో గ్యాస్**

ఎటువంటి నీటివసతి లేని మెట్టప్రాంతంలోని రైతులకు ఈ ప్లాంట్స్ ద్వారా పెద్ద ఎత్తున మేలు జరుగుతుంది. నైపర్ గడ్డితో గ్యాస్ తయారు చెయ్యబోతున్నారు. ప్రభుత్వ భూములకు 15 వేలు, రైతుల భూములకు రూ. 31 వేలు కౌలు కూడా ఇవ్వబోతున్నారు. రైతులే గడ్డి పెంచి ఇస్తే టన్నుకు నిర్ణీత ధర చెల్లిస్తారు. రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేసే సీబీజీ ప్లాంట్లన్నీ పూర్తిస్థాయిలో పనిచేస్తే ఏటా 110 లక్షల మెట్రిక్ టన్నుల ఆర్గానిక్ ఎరువు కూడా తయారు అవుతుంది. ఈ ప్లాంట్ల ద్వారా గ్రామీణ యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు రాబోతున్నాయి. నేను ప్రకాశం జిల్లా వచ్చిన ప్రతీ సారి మీరు చూపించే ప్రేమ, ఆప్యాయత నేను మర్చిపోలేను. ప్రకాశం జిల్లాలో పేదరికం లేకుండా చెయ్యడమే మా లక్ష్యం. రానున్న అయిదేళ్లలో ఆ లక్ష్యాన్ని సాధించి తీరుతాం.

**సీబీజీ హబ్ గా మారనున్న కనిగిరి**

ఏపీలో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్స్ పెట్టడానికి రిలయన్స్ ముందుకు వచ్చింది. ఈ రంగంలో 65 వేల కోట్ల పెట్టుబడి పెట్టబోతోంది. దీని ద్వారా 500 ప్లాంట్లు పెట్టడానికి రిలయన్స్ ముందుకు వచ్చింది. తద్వారా 2.5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు రాబోతున్నాయి. ప్రకాశం, అనంతపురం, చిత్తూరు, కడపలో 5 లక్షల ఎకరాల బీడు భూమిని వినియోగంలోకి తీసుకురాబోతున్నాం. నేను యువగళం ప్రకాశం జిల్లాకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాను. రిలయన్స్ మొదటి సీబీజీ ప్లాంట్ ను కనిగిరిలో ప్రారంభించాను. ప్రకాశం జిల్లాలో ఐదు వేల ఎకరాలు బీడు భూములు ఇచ్చాం. కనిగిరిలో 497 ఎకరాలు కేటాయించాం. కనిగిరి ప్లాంట్ రిలయన్స్ సీబీజీ ప్లాంట్ హబ్ గా మారబోతుంది. ఇక్కడే ఐదు ప్లాంట్స్ రాబోతున్నాయి.

**ప్రకాశం జిల్లా నా గుండెల్లో ఉంటుంది**

ఉమ్మడి ప్రకాశం జిల్లా అంటే నాకు మొదట గుర్తొచ్చేది పౌరుషం, ప్రేమ. ఇక్కడి ప్రజలకు పౌరుషం ఎక్కువే, ప్రేమ ఎక్కువే. ప్రకాశం జిల్లా ప్రజలకు టీడీపీ అన్నా, చంద్రబాబు అన్నా ఎనలేని ప్రేమ. 2019లో ఎదురుగాలి ఉన్నా టీడీపీని నాలుగు సీట్లలో గెలిపించారు. 2024 లో 10 సీట్లలో టీడీపీ అభ్యర్థులకు ఘన విజయాన్ని చేకూర్చారు. యువగళం పాదయాత్ర చేసినప్పుడు ఇక్కడ ప్రజల కష్టాలు చూశాను. ప్రకాశం జిల్లాలో యువగళం ఒక ప్రభంజనంగా మారింది. నేను ఆ రోజే చెప్పా, మీరు చూపించిన ప్రేమకు రెండింతలు తిరిగి ఇస్తానని. ప్రకాశం జిల్లా నా గుండెల్లో ఉంటుంది అని. 2014లో రాష్ట్ర విభజన జరిగింది. కట్టు బట్టలతో మనం ప్రయాణం ప్రారంభించాం. అందరి ఆమోదంతో అమరావతిని రాజధానిగా ప్రకటించాం. ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ ఎజెండాగా పనిచేశాం. అనంతపురంను ఆటోమొబైల్ హబ్ చేశాం. చిత్తూరు, కడపలో ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీలు తీసుకొచ్చాం. కర్నూలుకు రెన్యూవబుల్ ఎనర్జీ కంపెనీలు తీసుకొచ్చాం. ప్రకాశం జిల్లాకు అతిపెద్ద పేపర్ మిల్ తీసుకొస్తే ఆ కంపెనీని గత ప్రభుత్వం రానివ్వలేదు. ఉభయగోదావరి జిల్లాలను ఆక్వా రంగంలో నంబర్-1గా నిలబెట్టాం. ఉత్తరాంధ్రను ఐటీ, ఫార్మా హబ్ గా తయారు చేశాం.

**గత అయిదేళ్ల పాలనంతా విధ్వంసమే!**

2019 నుంచి 2024 వరకూ ఎం జరిగిందో మీరంతా చూశారు. రాష్ట్రంలో విధ్వంస పాలన నడిచింది. కొత్త కంపెనీలు తీసుకురాకపోగా ఉన్న కంపెనీలను తరిమేశారు. లులూ, అమర్ రాజా, హెచ్‌ఎస్బీసీ, జాకీ లాంటి అనేక కంపెనీలను బెదిరించి బయటకు పంపేశారు. నేను ఆ రోజే ఛాలెంజ్ చేశా... మీరు తెచ్చిన ఒక్క కంపెనీ పేరు చెప్పండి అని. ఇప్పటి వరకూ ఆ సైడ్ నుంచి సౌండ్ లేదు. దేశంలో ఏ పార్టీ చేయని సాహసం మేం చేశాం. ఎన్నికల ముందు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం అని చెప్పిన దమ్మున్న పార్టీ టీడీపీ. ఆ హామీ ఇచ్చే నేను అనేక మందితో మాట్లాడాను. అందరూ నీ ధైర్యం ఏంటి అని అడిగారు. నా ధైర్యం ఒక్కటే... నా బ్రాండ్ ఒక్కటే దటీజ్ సీబీఎన్ అని చెప్పా. 2024లో సైకో పాలనకు బైబై చెప్పి రాష్ట్ర ప్రజలు ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గెలిచిన మొదటి రోజు నుంచే ఉద్యోగాల వేట మొదలుపెట్టాం. యువగళం పాదయాత్ర నాలో మార్పు తెచ్చింది. జీడీ నెల్లూరు నియోజకవర్గంలో పాదయాత్ర సమయంలో ఒక కుగ్రామంలో ఒక తల్లి రోడ్డుపై బోండాలు వేస్తోంది. ఆకలివేస్తోంది, బోండాలు పెట్టమని అడిగా. ఆమెను ఏం కావాలని అడిగాను. మద్యానికి బానిసై నా భర్త చనిపోయాడు, 30ఏళ్లుగా టిఫిన్ కొట్టుపెట్టుకుని జీవనం సాగిస్తున్నా. ఇద్దరు బిడ్డలను చదివిస్తున్నా, వారికి ఉద్యోగాలు కావాలని కోరింది. మరుసటిరోజే సీఎం చంద్రబాబుకు ఫోన్ చేసి మ్యానిఫెస్టోలో మొదటిహామీగా 20 లక్షల ఉద్యోగాల

**రిలయన్స్ తో బాబుకు ప్రత్యేకమైన అనుబంధం**

రిలయన్స్ ఫౌండర్ ఛైర్మన్ ధీరూభాయ్ అంబానీతో చంద్రబాబుకు మంచి అనుబంధం ఉంది. జామ్‌నగర్‌లో ఉన్న రిలయన్స్ రిఫైనరీ చూడటానికి వెళ్ళినప్పుడు చంద్రబాబు టెలికాం రంగంలో విప్లవం రాబోతుంది అని ధీరూభాయ్ అంబానీతో చెప్పారు. చంద్రబాబుపై నమ్మకంతో ఆ రోజుల్లోనే ధీరూభాయ్ అంబానీ టెలికాం రంగంలో పెట్టుబడులు పెట్టారు. ఆ తరువాత ఆ అనుబంధం రిలయన్స్ ఛైర్మన్ ముకేశ్ అంబానీతో కూడా కొనసాగుతుంది. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత నేను ముకేశ్ అంబానీని, అనంత్ అంబానీని, రిలయన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీఎంఎస్ ప్రసాద్ ని కలిసి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించాను. ఏపీ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాదు... స్పీడ్ ఆఫ్ డూయింగ్ లో ముందుందని చెప్పాను. 21 రోజుల్లో ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ (ఐస్ ) తీసుకొస్తానని హామీ ఇచ్చాను. కానీ 30 రోజులు పట్టింది. అడిగిన వెంటనే ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టడానికి అంగీకరించిన ముకేశ్ అంబానీ, అనంత్ అంబానీ, రిలయన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీఎంఎస్ ప్రసాద్ కు మంత్రి లోకేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.

**కనిగిరి ట్రిపుల్ ఐటీకి త్వరలోనే శంకుస్థాపన**

ప్రకాశం జిల్లాలో ఎప్పుడు వచ్చినా నా పాదయాత్ర గుర్తొస్తుంది. నాపై చూపిన ప్రేమ, అభిమానం ఎప్పుడూ మర్చిపోను. కనిగిరిలో ట్రిపుల్ ఐటీకి త్వరలోనే శంకుస్థాపన చేస్తా. కనిగిరి రైల్వే ప్రాజెక్టుకు ఏప్రిల్ లో అవసరమైన నిధులిస్తాం. ఆగస్టులో సీఎంను రప్పించి రైల్వేప్రాజెక్టు పనులు ప్రారంభిస్తాం. మిగిలిపోయిన వెలుగొండ పనులు పూర్తిచేసి చివరి ఎకరాకు సైతం సాగునీరు అందిస్తాం. తాగునీటి శాఖ మంత్రి, నా సోదరుడు పవనన్న కేంద్రప్రభుత్వాన్ని ఒప్పించి ఆగిపోయిన జల్ జీవన్ మిషన్ పనులను ప్రారంభించారు. రాబోయే రోజుల్లో ప్రతిగడపకు తాగునీరు అందిస్తాం. వైసీపీ నాయకుల దుష్ప్రచారం చూస్తుంటే జాలివేస్తోంది. వారు చేయరు, చేసేవాళ్లను చేయనీయరు. బయోగ్యాస్ ప్లాంటుపై అపోహలు సృష్టిస్తున్నారు. అనవసరంగా అడ్డుపడితే ఎర్రబుక్ లోకి ఎక్కుతారు. నేను మంచి పనిచేయడానికి వచ్చా. అధికారంలోకి వచ్చిన 10నెలల్లోనే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుతో ప్రకాశం జిల్లాకు వచ్చా. తప్పుడు ప్రచారం చేస్తే ఎవరినీ వదిలిపెట్టను. ఆనాడు బీసీ గర్జన పేరుతో మేం ప్రకాశం జిల్లాలో కార్యక్రమం పెడితే ఉదయభాను యాంకర్ గా వచ్చారు. ఆనాడు బీసీ సోదరులపై దాడులను నిలదీశాం. ఉదయభానును ట్రోల్ చేశారు. బీసీ నేతలపై దొంగ కేసులు పెట్టారు. నాపై కూడా 23 కేసులు పెట్టారు. తగ్గేదే లేదని చెప్పాను. 94 శాతం సీట్లతో మీరు మమ్మల్ని గెలిపించారు. మీకు అండగా నిలుస్తాం.

**కనిగిరి నియోజకవర్గంలోనే 50 ప్లాంట్లు**

పాదయాత్ర సమయంలో సాయంత్రం సరదాగా కూర్చుని మాట్లాడుకునేవాళ్లం. మన ప్రాంతంలో ఏం మార్పుతేవాలనే విషయమై చర్చించేవాళ్లం. మా ప్రాంతంలో వలసలకు చెక్ పెట్టాలని ఉగ్ర నరసింహారెడ్డి చెప్పారు. అది గుర్తుపెట్టుకొని నేను, గొట్టిపాటి మొదటి సీబీజీ ప్లాంట్ కనిగిరిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. రిలయన్స్ ఆధ్వర్యాన మొదటి వంద సీబీజీ ప్లాంట్లు ప్రకాశం జిల్లాకు తేవాలని నిర్ణయించాం. ఈ ప్రాంత రైతులు 50 వేల ఎకరాలు కౌలుకు ఇస్తారని ఉగ్ర చెప్పారు. చెప్పిన ప్రకారం భూములిస్తే ఇక్కడే 50 ప్లాంట్లు ఏర్పాటు చేస్తాం. గత పదిరోజులుగా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి అవిశ్రాంతంగా పని చేశారు. కనిగిరి ప్రజల కోసం ఆయన కష్టపడ్డారు. ఇక్కడ ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఇక్కడే ఉద్యోగాలు కల్పించాలని ఆయన కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, ఆనం రాంనారాయణ రెడ్డి, డోలా బాల వీరాంజనేయ స్వామి, చీఫ్ సెక్రటరీ విజయానంద్, ప్రకాశంజిల్లా కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారియా, ట్రాన్స్ కో ఎండి కీర్తి చేకూరి, ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి, కందుల నారాయణరెడ్డి, బిఎన్ విజయకుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, ఎంఎం కొండయ్య, ఏలూరి సాంబశివరావు, కాకర్ల సురేశ్, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, 20 సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్, అగ్రికల్చర్ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, యర్రగొండపాలెం ఇన్ ఛార్జి ఎరిక్షన్ బాబు, దర్శి ఇన్ ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరక్టర్ పీఎంఎస్ ప్రసాద్, ఆర్‌ఐఎల్ మెంటర్ పీవీఎల్ మాధవరావు, రిలయన్స్ బయో ఎనర్జీ సీఈఓ హరీంద్ర కే త్రిపాఠి, నెడ్ క్యాప్ వీసీ అండ్ ఎండీ కమలాకర్ బాబు, సర్పంచ్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ హర్ష కుమార్‌కు నోటీసులు..!

కాదు. నేనే రైట్ ఇన్ఫర్మేషన్ యాక్ట్ ప్రకారం కొన్ని ప్రశ్నలు అడుగుతాను. మీరు నాకు సమాధానాలు ఇవ్వాల్సి వస్తుంది అని హర్ష కుమార్ పోలీసులను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఇది ఇలా ఉండగా గత నాలుగు రోజుల కిందట పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి చెందిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ నుంచి రాజమండ్రి వెళ్లే సమయంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పదంగా మృతి చెందారు. ఇక ఈ సంఘటనను దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.

# ఈ బిల్లు లేకపోతే..
# పార్లమెంట్ భూమినీ వక్ఫ్ ఆస్తి అంటారు

## విపక్షాలపై రిజిజు విమర్శలు

దిల్లీ: కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లును తీసుకువచ్చింది. కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు బిల్లు ప్రవేశపెట్టిన అనంతరం సభలో ప్రసంగించారు. ఈ బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్నామని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ బిల్లును తీసుకురాకపోతే.. పార్లమెంట్ భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా చెబుతారని అన్నారు.

"బిల్లు గురించి విపక్షాలు అసత్య ప్రచారం చేశాయి. అందులోని అంశాలను లేవనెత్తి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. 1954లో తొలిసారి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చింది. అది అప్రజాస్వామికం అని ఆనాడు ఎవరూ చెప్పలేదు. పార్లమెంట్ ఉభయ సభ్యులతో కూడిన జేపీసీకి అభినందనలు. మొత్తం 284 ప్రతినిధులు, 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వక్ఫ్ బోర్డులు జేపీసీలో తమ వాదనలు వినిపించాయి. మేం బిల్లులో కొన్ని సానుకూల మార్పులు చేస్తే.. మమ్మల్ని ఎందుకు ప్రశ్నిస్తున్నారు. ఈ బిల్లు తీసుకురాకపోతే.. కొందరు పార్లమెంట్ భవనాన్ని కూడా వక్ఫ్ ఆస్తిగా 'పేర్కొంటారు" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ స్పందనకు గతంలో ఏఐయూడీఎఫ్ చీఫ్ బద్రుద్దీన్ అజ్మల్ చేసిన వ్యాఖ్యలు కారణం. దేశ రాజధానిలోని పార్లమెంట్ భవనం, దాని పరిసర ప్రాంతాలు వక్ఫ్ ఆస్తికి



సంబంధించినవని అజ్మల్ అప్పట్లో వాదించారు.

"వక్ఫ్ బిల్లు ముస్లిం సమాజానికి చెందిన మత విశ్వాసాలకు ఎలాంటి ఆటంకం కలిగించదు. ఇది కేవలం ఆస్తుల నిర్వహణకు సంబంధించిన విషయం మాత్రమే. ఈ బిల్లుకు మద్దతు ఇచ్చేవారు, వ్యతిరేకించేవారు ఎప్పటికీ గుర్తుండిపోతారు. పేద ముస్లింలకు వక్ఫ్ ఆస్తులను ఉపయోగించాలి. వారిని అలా వదిలేయకూడదు. వారి ఉన్నతి కోసం మోదీ ప్రభుత్వం ఏవైనా చర్యలు తీసుకుంటే ఎందుకు వ్యతిరేకిస్తున్నారు..? ముస్లిం ప్రతినిధులు ఆ బిల్లును ఆహ్వానించారు. వీలైనంత త్వరగా దీనికి ఆమోదం లభించాలని ఆ వర్గంలోని పేదలు కోరుకుంటున్నారు. అలాగే రిజిస్టర్ చేసిన ఆస్తి విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరు. ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో ముస్లిం మహిళలు, పిల్లలకు వారి హక్కులు దక్కుతాయి. ప్రభుత్వ భూమి విషయంలో వివాదం తలెత్తితే కలెక్టర్ కంటే పైస్థాయి వ్యక్తి తీర్పు ఇవ్వాలంటూ జేపీసీ చేసిన ప్రతిపాదనను మేం అంగీకరించాం" అని రిజిజు స్పష్టత ఇచ్చారు. మరోవైపు విపక్షాలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. ఈ బిల్లుకు వ్యతిరేకంగా కోల్‌కతాలో మార్చ్ జరిగింది.

# లోక్‌సభ ముందుకు వక్ఫ్ బిల్లు.. ప్రవేశపెట్టిన కేంద్రం


దిల్లీ: వివాదాస్పద వక్ఫ్ (సవరణ) బిల్లు లోక్‌సభ ముందుకువచ్చింది. ఈ బిల్లుకు వ్యతిరేకంగా విపక్షాలు ఆందోళన చేపట్టాయి. వారి నిరసనల నడుమ బుధవారం మధ్యాహ్నం కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై రిజిజు చర్చ చేపట్టారు. దాదాపు 8 గంటల పాటు చర్చ జరిపిన అనంతరం ఓటింగ్ నిర్వహించనున్నారు. ఈ బిల్లును ఆమోదింపజేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం పట్టుదలతో ఉండగా విపక్షాలన్నీ వ్యతిరేకిస్తున్నాయి.



వక్ఫ్ పాలకవర్గాల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచుతూ పాలనలో మహిళల భాగస్వామ్యం తప్పనిసరి చేసేలా ఈ కొత్త బిల్లును కేంద్రం తీసుకొచ్చింది. ఈ మేరకు 1995 నాటి వక్ఫ్ చట్టంలో దాదాపు 40 సవరణలు చోటుచేసుకోనున్నాయి. ముస్లిం సమాజం నుంచి వస్తున్న డిమాండ్ల మేరకే ఈ మార్పులు చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. ఈ బిల్లును గతేడాది ఆగస్టులోనే కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అప్పుడు దీనిపై విపక్షాల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత రావడంతో దీనిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు పంపింది. ఈ కమిటీ పలు ప్రతిపాదనలతో బిల్లుకు ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో వక్ఫ్ బిల్లును కేంద్రం నేడు లోక్‌సభ ముందుకు తీసుకొచ్చింది. లోక్‌సభలో ఆమోదం పొందిన తర్వాత గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. ఉభయ సభల్లో అధికార ఎన్డీయేకు మెజారిటీ ఉన్నందున బిల్లు ఆమోదానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని భాజపా భావిస్తోంది.

# రష్యాలో కొవిడ్ తరహా మిస్టరీ వైరస్?

రష్యా : రష్యాలో అంతుచిక్కని వైరస్ విజృంభిస్తున్నట్లు పలు వార్తాసంస్థలు పేర్కొంటున్నాయి. అక్కడి ప్రజలు తీవ్రమైన శ్వాసకోస సంబంధిత వ్యాధులతో.. దీర్ఘకాలిక జ్వరంతో బాధపడుతున్నారని తెలిపాయి. వైరస్ కారణంగా వారు దగ్గుతున్నప్పుడు రక్తం పడుతోందనే నివేదికలు ప్రపంచ దేశాల్లో ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. రష్యాలో మిస్టరీ వైరస్ విజృంభిస్తోందని మార్చి 29న పలు నివేదికలు వెలువడ్డాయి. పలు నగరాల్లో ప్రజలు వారాలతరబడి జ్వరం, ఒళ్లు నొప్పులు, తీవ్ర దగ్గుతో బాధపడుతున్నారని.. ఈ వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోందని అవి పేర్కొన్నాయి. అయితే కొవిడ్ టెస్టులు చేసినప్పుడు నెగిటివ్ వచ్చిందని.. ఇది మరో కొత్త వైరస్ అయి ఉంటుందని అభిప్రాయం వ్యక్తంచేశాయి.



రష్యాకు చెందిన అలెగ్జాండ్రా అనే మహిళ ఐదు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతుందని.. కొన్ని రోజులకు దగ్గుతున్న సమయంలో రక్తం పడుతున్నట్లు తెలిపిందని నివేదికలు వెల్లడించాయి. ఎన్ని మందులు వాడినప్పటికీ తగ్గుదల కనిపించట్లేదని ఆందోళన వ్యక్తంచేశాయి. ఇటువంటి అనేక ఇతర కేసుల గురించి వివరించాయి. మరికొందరు నెటిజన్లు తాము తీవ్రమైన రక్తంతో కూడిన దగ్గుతో బాధ పడుతున్నట్లు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

### అవన్నీ తప్పుడు ప్రచారాలు..

కాగా ఈ నివేదికలను రష్యన్ అధికారులు ఖండించారు. తాము జరుపుతున్న పరీక్షల్లో దేశంలో ఎలాంటి నూతన వ్యాధి కారకాలు బయటపడలేదని.. కొత్త వైరస్ వ్యాపించినట్లు ఎటువంటి ఆధారాలు లేవని వెల్లడించారు. రకరకాల వదంతులు, తప్పుడు ప్రచారాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నప్పటికీ అందులో నిజం లేదన్నారు. నివేదికల్లో పేర్కొన్న మహిళకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు మైకోప్లాస్మా న్యుమోనియా ఉన్నట్లు నిర్ధరించారని తెలిపారు. ఒకవేళ కొవిడ్ తరహా వైరస్ వస్తే దానిని ఎదుర్కోవడానికి తగిన సదుపాయాలు ఉన్నాయన్నారు.

# జంతర్‌మంతర్‌లో కొనసాగుతున్న బీసీ సంఘాల ధర్నా



దిల్లీ: బీసీ సంక్షేమ సంఘం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో దిల్లీ జంతర్‌మంతర్ వేదికగా బీసీ సంఘాల ధర్నా కొనసాగుతోంది. కాంగ్రెస్ సహా అన్ని పార్టీలను బీసీ సంఘాలు ధర్నాకు ఆహ్వానించాయి. ఈ నిరసనలో తెలంగాణ మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్, నటుడు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ, ఎంపీలు కనిమొళి, సుప్రియా సూలే తదితరులు ఈ ధర్నాకుకు హాజరై సంఘీభావం తెలిపారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ తెలంగాణ శాసనసభ ఆమోదించిన బిల్లును.. పార్లమెంట్‌లోనూ ఆమోదించి అమలు చేయాలని.. దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేయాలని, 33శాతం మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్‌కోటా కేటాయించాలని నేతలు డిమాండ్ చేశారు.

# వచ్చే మార్చికల్లా నక్సలిజం నిర్మూలన

## 'ఎక్స్' వేదికగా ప్రకటించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా



దిల్లీ: నరేంద్ర మోదీ ప్రభుత్వం నక్సల్స్ రహిత భారతాన్ని సృష్టించే యజ్ఞంలో పురోగమిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం 'ఎక్స్'లో ప్రకటించారు. నక్సలిజం పట్ల కఠిన వైఖరి అవలంబిస్తూ నక్సల్స్ ప్రభావిత జిల్లాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ దేశంలో వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాల సంఖ్యను 12 నుంచి 6కి తగ్గించామని పేర్కొన్నారు.

2026 మార్చి 31 కల్లా నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాలని భారత్ లక్షిస్తోందన్నారు. దేశంలో నక్సలిజం ప్రభావిత జిల్లాలు 38 ఉండగా, వాటిలో 12 జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని, ఇప్పుడు అవి ఆరుకు తగ్గాయని కేంద్ర హోంశాఖ తెలిపింది. 38 నక్సలిజం ప్రభావిత జిల్లాల్లో ఆందోళనకర జిల్లాలు ఉన్నాయనీ, వాటిలో అల్లూరి సీతారామ రాజు జిల్లా (ఆంధ్రప్రదేశ్), భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా (తెలంగాణ) కూడా ఉన్నాయని తెలిపింది. ప్రభుత్వం తీసుకున్న గట్టి చర్యల వల్ల తెలంగాణలోని ములుగు జిల్లాలో వామపక్ష తీవ్రవాదం తగ్గుముఖం పట్టిందని వివరించింది. నక్సలిజం వల్ల తీవ్రంగా ప్రభావితమైన జిల్లాల్లో రూ.30 కోట్లతో, ఆందోళనకర జిల్లాల్లో రూ.10 కోట్లతో మౌలిక వసతులను అభివృద్ధి చేశామని, ఈ నిధులను కేంద్రం ప్రత్యేక సహాయంగా అందించిందని హోం శాఖ వెల్లడించింది. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాల వరుస కాల్పుల్లో పలువురు మావోయిస్టులు మరణించిన సంగతి

# మరో 15 బ్యాంకులతో ఈపీఎఫ్ఓ భాగస్వామ్యం

దిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) తన బ్యాంకింగ్ నెట్‌వర్క్‌ను మరో 15 బ్యాంకులకు విస్తరించినట్లు మంగళవారం తెలిపింది. దీంతో ఈపీఎఫ్ఓతో ఒప్పందం కుదుర్చుకున్న బ్యాంకుల సంఖ్య 32కు చేరింది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ సమక్షంలో ఈ ఒప్పందాలు కుదిరాయి. కొత్తగా చేరిన 15 ప్రభుత్వ/ప్రైవేటు బ్యాంకుల ద్వారా ఏడాదికి రూ.12,000 కోట్ల సేకరణ సులభం కానుంది.

ఈ బ్యాంకుల్లో ఖాతాలున్న యాజమాన్యాలు, నేరుగా ఈపీఎఫ్ఓకి చెల్లింపు చేసేందుకు సౌలభ్యం ఏర్పడింది. ఈ సందర్భంగా మాండవీయ మాట్లాడుతూ.. 2024-25లో ఈపీఎఫ్ఓ 6 కోట్ల క్లెయిములను పరిష్కరించి రికార్డు సృష్టించిందని పేర్కొన్నారు. అంతకు క్రితం ఏడాదిలో పరిష్కరించిన 4.45 కోట్ల క్లెయిమ్‌లతో పోలిస్తే, ఈ సంఖ్య 35% అధికం అని తెలిపారు. కేంద్రీకృత పింఛను చెల్లింపు వ్యవస్థను ప్రవేశపెట్టడంతో 78 లక్షల పింఛనుదారులు దేశ వ్యాప్తంగా ఏ బ్యాంకు ఖాతాలోనైనా పెన్షన్ తీసుకోవచ్చని వివరించారు. 2024-25లో మార్చి 20 నాటికి ఈపీఎఫ్ఓ రూ.3.41 లక్షల కోట్లను సభ్యుల చందాల రూపంలో సేకరించినట్లు తెలిపారు.

### కొత్తగా చేరిన బ్యాంకులు

హెచ్ఎస్‌బీసీ, స్టాండర్డ్ చార్టర్డ్, ఫెడరల్, ఇండస్‌ఇండ్, కరూర్ వైశ్య, ఆర్‌బీఎల్, సౌత్ ఇండియన్, సిటీ యూనియన్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్, యూకో, కర్ణాటక, డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ సింగపూర్, తమిళనాడు మర్కంటైల్, డెవలప్‌మెంట్ క్రెడిట్, బంధన్ బ్యాంకులున్నాయి.




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా


తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

గురువారం 03 ఏప్రిల్ 2025

## ప్రజా సమస్యలపై తక్షణమే పరిష్కారం కోసం కృషి.

**ఎమ్మెల్యే సత్యానందరావు**



**రావులపాలెం, ఏప్రిల్ 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

నియోజకవర్గంలో ప్రజలు వారి సమస్యలను నేరుగా తమ దృష్టికి తేవాలని సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులు సంప్రదించి సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తామని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని తెలిపారు. కూటమి ప్రభుత్వములో ప్రజా సమస్యలకే పెద్దపీట వేస్తున్నామని, ఎవరికి ఏ సమస్య వచ్చినా నిరభ్యంతరంగా వారి సమస్యలను తెలపవచ్చని తక్షణమే చర్యలకు ఆదేశాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని, సమస్యలు పరిష్కారం వెంటనే జరుగుతుందని తెలిపారు. సమస్యలు పరిష్కరించడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రజా దర్బార్ కు అధిక సంఖ్యలో ప్రజల వచ్చి సమస్యలపై వినతలు అందజేశారని ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, చిలువూరి సతీష్ రాజు, మెర్ల గోపాలం, కాస సాగర్, సాధనల శ్రీను, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రావులపాలెం సెంటర్ లో ట్రాఫిక్ సమస్య పరిష్కారిస్తాం.

**సుందరీకరణకు ప్రాధాన్యం. -ఎమ్మెల్యే సత్యానందరావు**






**రావులపాలెం, ఏప్రిల్ 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కోనసీమ ముఖ ద్వారం రావులపాలెం సెంటర్ లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పరిష్కార మార్గాలను సిద్ధం చేస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. హైవే అధికారుల, ఆర్ అండ్ బీ, పోలీసు అధికారులతో కలిసి రావులపాలెం సెంటర్ పరిసర ప్రాంతాలను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం స్థానిక మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ నియంత్రణ పై అవగాహన సదస్సు సమావేశంలో సత్యానందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కోనసీమ ముఖద్వారం వద్ద, ప్రతి శనివారం వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి భక్తులకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే రావులపాలెం సెంటర్ ను కూడా సుందరీకరణకు ప్రాధాన్యం ఇస్తామని ఆహ్లాదకరంగా ఉండే విధంగా అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. ఇందుకు తగ్గట్టుగా అంచనాలను సిద్ధం చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఎమ్మెల్యే సత్యానందరావు కోరారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కె వి సత్యనారాయణ రెడ్డి, గుత్తుల రాంబాబు, చిలువూరి సతీష్ రాజు, జక్కంపూడి వెంకటస్వామి, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జగన్మోహనుడి చెంత కేశవ దీక్షధారణ ప్రారంభం

**100 మంది కి పైగా దీక్ష స్వీకరణ.**




**ఆత్రేయపురం ఏప్రిల్ 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో ప్రముఖ స్వయంబు క్షేత్రం జగన్మోహిని కేశవ స్వామి ఆలయంలో ఐదు బుధవారాలు, ఐదు ప్రదక్షిణలు చెసినచో కోరిన కోర్కెలు నెరవేరునని ప్రతితి. స్వామి వారిపై నమ్మకంతో భక్తులు బుధవారం రోజు శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవముల సందర్భంగా కేశవ దీక్ష మాలాధారణ కార్యక్రమం ప్రారంభించారు. కేశవ దీక్షాధారులు (100 మందికి) పైగా 02-04-2025 నుండి 13-04-2025 వరకూ అత్యంత నిష్ఠతో, మాలా నియామములు పాటిస్తూ, శ్రీ స్వామి వారి సేవలో తరిస్తారని ఆలయ కార్యనిర్వాహణాధికారి బి హెచ్ వి ఆర్ మూర్తి తెలిపారు.









## వినతుల స్వీకరణ

**అమలాపురం, ఏప్రిల్ 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అమలాపురం ఎమ్మెల్యే గారి క్యాంప్ కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో గౌరవ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు నియోజకవర్గ ప్రజల నుండి ఫిర్యాదులు, అర్జీలు స్వీకరించడం జరిగింది.



## కార్పొరేషన్ లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు



**అయినవిల్లి ఏప్రిల్ 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

బిసి, కాపు, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ ద్వారా అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు ఎంపీడీవో గిడ్డి భీమారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ బ్యాంక్ నేదునూరు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అనాతవరంరం బ్యాంక్ మేనేజర్ ల పర్యవేక్షణలో బుధవారం లబ్ధిదారులకు ఇంటర్వ్యూలను నిర్వహించినట్లు తెలిపారు. మండలంలోని నేదునూరు ఎన్ పెదపాలెం, నల్లచెరువు, క్రాప శంకరాయగూడెం, మాగం, పోతుకుర్రు, గ్రామాల నుండి 477 మంది అప్లై చేసుకోగా 384 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరైనట్లు తెలిపారు.

## విలస జిల్లా పరిషత్ పాఠశాలలో భోజనశాల ప్రారంభం



**అయినవిల్లి ఏప్రిల్ 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మండలంలోని విలస జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి కొప్పిశెట్టి రామకృష్ణ భోజనశాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం భాష పేర్కొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో పూర్వ విద్యార్థిగా రామకృష్ణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బాధ్యతలు నిర్వర్తిస్తూ తన వంతు సహకారాన్ని అందించి పాఠశాల విద్యార్థులకు భోజనశాలలోని టేబుల్స్ నిర్మాణానికి కృషిచేసిన ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మట్టపర్తి నాగ విజయలక్ష్మి పండు జడ్పిటిసి గన్నవరపు శ్రీనివాసరావు శ్రీను సర్పంచ్ కుసుమ లిల్లీ మంగేష్కర్ ఎంపీటీసీ కుప్పల రాంబాబు ప్రధానోపాధ్యాయుడు పివి రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన సి.ఆర్.సి 25వ ఉగాది ఆహ్వాన నాటికల పోటీలు

**- ఉత్తమ ప్రదర్శనగా స్వేచ్ఛ నాటిక**











**రావులపాలెం, ఏప్రిల్ 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రావులపాలెం సి.ఆర్.సి కాటన్ కళా పరిషత్ ఆధ్వర్యంలో గత మూడు జరుగుతున్న 25వ ఉగాది ఆహ్వాన నాటికల పోటీలు మంగళవారం రాత్రి ముగిసాయి. సి.ఆర్.సి ఏసి ఆడిటోరియంలో మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వివిధ పరిషత్తుల ఆధ్వర్యంలో మొత్తం ఏడు నాటికలు ప్రదర్శించారు. వీటిలో హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ వారి స్వేచ్ఛ నాటిక ఉత్తమ ప్రదర్శనగా ప్రథమ బహుమతి గెలుచుకుంది. కొలకలూరు సాయి ఆర్ట్స్ వారి జనరల్ బోగీలు నాటిక ద్వితీయ, విజయవాడ మైత్రి కళానిలయం వారి బ్రహ్మ స్వరూపం నాటిక తృతీయ ఉత్తమ ప్రదర్శనలుగా నిలిచాయి. అలాగే ఉత్తమ దర్శకుడిగా బి.ఎం.రెడ్డి ( స్వేచ్ఛ), ఉత్తమ రచయితగా పి.టి.మాధవ్ ( జనరల్ బోగీలు), ఉత్తమ నటనకు జనరల్ బోగీలు నాటికలో సావిత్రమ్మ పాత్రధారి సురభి ప్రభావతి ప్రథమ బహుమతి గెలుచుకోగా, బహ్మ స్వరూపం నాటికలో యశోద పాత్రధారి ఎం. రత్నకుమారి ద్వితీయ, స్వేచ్ఛ నాటికలో ఆనంద్ మూర్తి పాత్రధారి వెంకట్ గోవాడ తృతీయ బహుమతి సాధించారు. అలాగే ఉత్తమ ఆహార్యం కె.నాగు ( జనరల్ బోగీలు), ఉత్తమ సంగీతం పి. లీలా మోహన్ ( బ్రహ్మ స్వరూపం), ఉత్తమ రంగాలంకరణ రోహిత్, భీం ( స్వేచ్ఛ) బహుమతులు గెలుచుకున్నారు. న్యాయ నిర్ణేతలుగా చలసాని కృష్ణ ప్రసాద్, పి. గోవిందరావు, వై.ఎస్.కె.ఎన్.స్వామి వ్యవహరించారు. విజేతలకు



సి.ఆర్.సి కాటన్ కళా పరిషత్ గౌరవ అధ్యక్షుడు, సినీ నటుడు తనికెళ్ల భరణి, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, సి.ఆర్.సి రూపశిల్పి డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డి చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేసారు. మెమెంటోలతో పాటు ప్రథమ, ద్వితీయ, తృతీయ ఉత్తమ ప్రదర్శనలకు రూ. లక్ష, రూ. 75 వేలు, రూ.50 వేలు నగదు బహుమతులు అందజేసారు. నాటిక పోటీలు ముగిసిన అనంతరం సి.ఆర్.సి ఆధ్వర్యంలో అలా ఎలా ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. విక్టరీ వెంకటరెడ్డి రచించిన ఈ నాటికకు గంటా రామ్మోహనరావు దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.సి అధ్యక్షుడు తాడి నాగ మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి వీర రాఘవరెడ్డి, ఉపాధ్యక్షుడు చిన్నం తేజారెడ్డి, కోశాధికారిగా కొవ్వూరి నరేష్ కుమార్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ దండు వెంకట సూర్యనారాయణ రాజు, నాటక కళా పరిషత్ డైరెక్టర్ కట్లమూడి సూర్యనారాయణ, డైరెక్టర్లు మల్లిడి అంజనీ కుమార్ రెడ్డి, పడాల సత్యనారాయణరెడ్డి, నడింపల్లి వెంకట సుబ్బరాజు, రుద్రరాజు వెంకట సీతారామాంజనేయ రాజు, కుడుపూడి శ్రీనివాసరావు, సత్తి సూర్య భాస్కరరెడ్డి, కేశవరపు రంగనాయకులు, సత్తి రాజశేఖరరెడ్డి, సింగంశెట్టి నాగేశ్వరరావు, సినీ నటులు గౌతంరాజు, గుండు సుదర్శన్, జోగి నాయుడు, నెల్లూరు హరిబాబు, పరిషత్ సలహాదారు గంటా రామ్మోహనరావు, పలివెల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.





# ఎమ్మెల్సీగా రాజశేఖర్ ప్రమాణ స్వీకారం

**కాకినాడ ఏప్రిల్ 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఎన్నికైన పేరాబత్తుల రాజశేఖర్ బుధవారం శాసన మండలిలో ప్రమాణ స్వీకారం చేశారు. మండలి చైర్మన్ మోషేన్ రాజు ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి లతోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రాజశేఖర్ ను వారు అభినందించారు. బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన రాజశేఖర్ ఐ పోలవరం జడ్పిటిసిగా పనిచేసారు. అంతకుముందు కాంగ్రెస్ లో గెలిచి ఎంపీపీ గా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఆయన కాకినాడలో నివాసం ఉంటున్నారు. గతంలో ఆయనకు జడ్పీ చైర్మన్ పదవి రావాల్సి ఉంది. కానీ అవకాశం దక్కలేదు. అదే విధంగా మొన్నటి ఎన్నికల్లో కాకినాడ రూరల్ టికెట్ ఆశించారు. అది కూడా నిరాశపరిచింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ పదవి ఆయనను వరించింది. పిడిఎఫ్ కు చెందిన అభ్యర్థి పై భారీ మెజార్టీతో గెలిచారు.


## ఎమ్మెల్సీ పేరాబత్తులకు అభినందనలు తెలిపిన మంత్రి సుభాష్....



**రామచంద్రపురం, ఏప్రిల్ 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా (కూటమి పార్టీ బలపరిచిన అభ్యర్థి) అత్యధిక మెజార్టీతో గెలిచి బుధవారం రోజున ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన పేరాబత్తుల రాజశేఖర్ ను అమరావతిలోని శాసనమండలి హాలులో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కలసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శాసనమండలిలో నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వ పాలనపై, స్వర్ణాంధ్ర విజన్ సాధకులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై ఎంతో నమ్మకంతో అత్యధిక మెజార్టీ అందించిన పట్టబద్రులందరికీ ఈ సందర్భంగా మంత్రి సుభాష్ కృతజ్ఞతలు తెలిపారు.

## జైళ్లను సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి



**రాజమహేంద్రవరం, ఏప్రిల్ 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఎన్ శ్రీలక్ష్మి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారాన్ని, ప్రత్యేక మహిళ కారాగారాన్ని బుధవారం సందర్శించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నియమించిన పారా లీగల్ వాలంటీర్లతో మాట్లాడారు. ఖైదీలకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవల గురించి అందరికీ తెలియజేయాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు సంస్థ దృష్టికి తీసుకురావాలని అన్నారు. కారాగారంలోని వసతులను, సదుపాయాలను పరిశీలించిన అనంతరం ఖైదీలతో మాట్లాడారు. ఉచిత న్యాయ సేవలు పొందడం ఖైదీల హక్కు అని, ఖైదీల తరపున వాదించేందుకు న్యాయవాది లేని వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. ఈ సేవలను అందరూ వినియోగించుకోవాలని అన్నారు. వారికి ఎలాంటి న్యాయ సమస్యలున్నా పారా లీగల్ వాలంటీర్ల ద్వారా కానీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ద్వారా కానీ సంస్థకు తెలియజేయాలని అన్నారు. అనాలోచితంగా చేసే పనుల వల్ల అనేక ఇబ్బందులు కలుగుతాయని, ఏ పని అయిన చేసే ముందు మంచి చెడులు ఆలోచించుకోవాలని, చెడు సహవాసాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ఖైదీలందరూ పరివర్తన చెంది న్యాయబద్ధమైన జీవనశైలిని అలవరుచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సబ్యులు, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

## జగన్మోహన్ రెడ్డిని కలిసిన గిరజాల

**కడియం, ఏప్రిల్ 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని కడియం కు చెందిన రాష్ట్ర వైకాపా కార్యదర్శి గిరిజాల బాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.తాడేపల్లి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో కలిసి శ్రీ విశ్వా వసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.పార్టీ కార్యక్రమాలపై ముచ్చటించారు.



# అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు

## - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, ఏప్రిల్ 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



అర్హులందరికీ కొత్త రేషన్ కార్డుల మంజూరుకు ప్రభుత్వం కసరత్తులు ప్రారంభించిందని, అందుకు గత కొన్ని రోజులుగా లబ్దిదారుల ఎంపిక చేపట్టిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గతంలో వైకాపా వింత నిర్ణయాలు... నిబంధనల కారణంగా అర్హులైనా రేషన్ కార్డులు లేకపోవడంతో అనేక మంది ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలను పొందలేకపోయారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన లోటు పాట్లను వెలికితీసి అర్హులైన లబ్దిదారులందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దారిద్ర్య రేఖకు దిగువనున్న పేదలందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని నిర్ణయించిందని, సమగ్రంగా పరిశీలించిన తర్వాత మాత్రమే కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఏటీఎం కార్డు సైజులోనే... కొత్త రేషన్ కార్డులను కూడా పూర్తిగా మార్చేయాలని నిర్ణయించిందని, ఇప్పటి వరకూ ఉన్న రేషన్ కార్డుల స్థానంలో కొత్త రేషన్ కార్డుల సైజును కూడా తగ్గించనుందని పేర్కొన్నారు. ఈ ఏడాది మే నుంచి ఏటీఎం కార్డు సైజులో కొత్త రేషన్ కార్డులు జారీ చేయబోతున్నారని, ఏప్రిల్ 30వ తేదీతో ఈ కేవైసీ ప్రక్రియ పూర్తి అయిన వెంటనే కొత్త రేషన్ కార్డులు జారీ చేసేందుకు అధికార యంత్రాంగా చర్యలు చేపట్టిందన్నారు. కాగా కొత్త కార్డుల జారీ సమయంలోనే కుటుంబ సభ్యులను చేర్చడంతో పాటు, తొలగింపు, స్ప్లిట్ కార్డుల కోసం ఆప్షన్లు ఇవ్వనున్నారని తెలిపారు. క్యూఆర్ కోడ్ లాంటి భద్రతా ఫీచర్లతో కొత్త రేషన్ కార్డులు జారీ అవుతాయని, గత ప్రభుత్వంలా ఎక్కడా వ్యక్తుల బొమ్మలు రేషన్ కార్డుపై ఉండబోవని స్పష్టం చేశారు.

# అంజుమన్ సంస్థ నూతన కార్యవర్గం ఎంపిక

## వర్కింగ్ కమిటీ కార్యవర్గ సభ్యుడుగా రియాజ్ అలీ ఖాన్



**ఏలూరు ఏప్రిల్ 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

గత సంవత్సర కాలంగా అంజుమన్ సంస్థలో జరుగుతున్న అవకతవకలను గుర్తించడంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందని అంజుమన్ నూతన వర్కింగ్ కమిటీ కార్యవర్గ సభ్యుడు రియాజ్ అలీ ఖాన్ తెలిపారు. ఏలూరులోని వన్ టౌన్ లో గల అంజుమన్ కళ్యాణ్ మండపంలో బుధవారం నూతన కార్యవర్గ సభ్యులు పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రియాజ్ అలీ ఖాన్ మాట్లాడుతూ అంజుమన్ అంటే పేదలకు, బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేసే ఒక కమిటీ అని తెలిపారు. గతంలో ఎన్నికైన ప్రెసిడెంట్ సులేమాన్ తన పదవిని అడ్డం పెట్టుకొని అంజుమన్ కళ్యాణ మండపంలో జరిగే బుకింగ్స్లు , అమౌంట్ రూపంలో అనేక అవకతవకులు చేశారని మండిపడ్డారు. ఈ విషయం బయటపడటంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. అంజుమన్ లో ప్రతినెలకి సారి కార్యవర్గ సమావేశం నిర్వహించాలని, కానీ 8 నెలల నుంచి ఎటువంటి సమావేశం నిర్వహించకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గ ప్రెసిడెంట్ జబివుల్లా సాహెబ్, సెక్రటరీ అహ్మదుల్లా షరీఫ్ సాహెబ్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన

# రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పర్యటన

## జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్



**ఒంగోలు మార్చి 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ప్రకాశం జిల్లా పిసి పల్లి మండలం, దివాకరపల్లె గ్రామం వద్ద ఏర్పాటు చేయనున్న రిలయన్స్ సీబీజీ ప్లాంట్ భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ విచ్చేసిన సందర్భంగా హెలిప్యాడ్ ఏరియా వద్ద ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ మర్యాద పూర్వకంగా కలిశారు. తదుపరి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని మరియు సభకు గౌరవ మంత్రి వర్యులు పాల్గొని తిరిగి బయలుదేరారు. ముందుగా హెలిప్యాడ్, వి.ఐ.పి రూట్, బందోబస్తు, సభా వేదిక, డ్రోన్ కెమెరాలతో చుట్టూ ఉన్న ప్రదేశాన్ని, పార్కింగ్ ప్రదేశాలను మరియు భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ పరిశీలించి అధికారులకు పలు సూచనలు తెలియచేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన బందోబస్తు మరియు భద్రతా ఏర్పాట్లు చేసి మంత్రి పర్యటన విజయవంతంగా నిర్వహించడమైనది. బందోబస్తుల పాల్గొన్న పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## సింహాచలం చందనోత్సవానికి హెూంమంత్రికి ఆహ్వానం

**కాకినాడ, మార్చి 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**




సింహాచలం క్షేత్రంలో ఈ నెల 8న జరిగే వార్షిక తిరు కల్యాణోత్సవం, 30న జరిగే అప్పన్న స్వామి నిజరూప దర్శనం చందనోత్సవాలకు హాజరు కావాలని రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనితని ఆలయ ఇంచార్జి ఈవో, రాజమండ్రి దేవాదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ కొమ్ముల సుబ్బారావు ఆహ్వానించారు. సింహాచలం ఈవో వేంద్ర త్రినాధరావు మూడు నెలల సెలవులో ఉన్నారు. దీంతో ఆయన స్థానంలో ఇంచార్జ్ ఈవోగా రాజమండ్రి ఆర్ జె సి సుబ్బారావును నియమించారు. చందనోత్సవ ఉత్సవం ఆయనే నిర్వహించనున్నారు. బుధవారం విజయవాడలోని హెూంమంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా అప్పన్నస్వామి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను ఆయన హెూంమంత్రికి అందజేశారు.

# శంఖవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ప్రసాద్

**శంఖవరం, ఏప్రిల్ 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

శంఖవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎఫ్ఏసి)గా ఎన్ఎమ్ కెజి ప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు శంఖవరం ఎంపిడిఓగా పనిచేసిన ఎస్ సుబ్రహ్మణ్య శర్మ సామర్లకోటలోని ఈటిసికు బదిలీపై వెళ్ళారు. సుబ్రహ్మణ్య శర్మ శంఖవరం మండలంలో సుమారు 8 నెలల కాలం పాటు పనిచేసారు. నూతన ఎంపిడిఓగా బాధ్యతలు చేపట్టిన ప్రసాద్ శంఖవరం మండల పరిషత్ పరిపాలనాధికారిగా గత కొంతకాలంగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సుబ్రహ్మణ్య శర్మ బదిలీ కావడంతో ఎఓ ప్రసాద్ కు పూర్తి అదనపు బాధ్యతలతో కూడిన ఎంపిడిఓగా పదోన్నతి లభించింది. దీనితో పలు శాఖల సిబ్బంది ఎంపిడిఓ ప్రసాద్ కు శుభాకాంక్షలు తెలిపారు.



# ఆదర్శనీయుడు వీరభద్రరావు

**రాజమహేంద్రవరం, ఏప్రిల్ 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



మాజీ శాసనసభ్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్, అజాతశత్రువు శ్రీ పోతుల వీరభద్ర రావు గారు 26వ వర్ధంతి సభ స్థానిక టౌన్ హాల్లో అత్యంత వైభవంగా జరిగింది ఈ కార్యక్రమంలో రాష్ట్ర సినిమాటోగ్రఫీ మరియు టూరిజం శాఖ మంత్రివర్యులు శ్రీ కందులు దుర్గేష్ గారు పాల్గొని శ్రీ వీరభద్ర రావు గారి గురించి ఆయన చేసిన సేవలు గురించి ప్రసంగిస్తూ ఉద్వేగానికి లోనయ్యారు. స్వర్గీయ వీరభద్ర రావు గారు మచ్చలేని రాజకీయ జీవితాన్ని జీవించారని అనేక సాహిత్య కార్యక్రమాలలో పాల్గొని గొప్ప గొప్ప కవీశ్వరుల చేత మెప్పు పొందిన గొప్ప సాహిత్య వేత్తని, ఆయన ఫుట్బాల్ క్రీడార రంగంలో విశేష ప్రతిభ కనబరిచి అనేక అంతర్జాతీయ టోర్నమెంట్లలో పాల్గొనడమే గాక నిర్వహించారని, అందుచేత ఆయన పేరు రాజమండ్రి మున్సిపల్ స్టేడియం కు నామకరణం చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు శ్రీ సత్తి పెద గంగిరెడ్డి గారికి,ప్రముఖ సాహిత్య వేత్త శ్రీ వివి సుబ్రహ్మణ్యం గారికి ప్రముఖ ఫుట్ బాల్ క్రీడాకారులు శ్రీ సింగారం భాస్కర్ గారికి, లాఫింగ్ క్లబ్ అధ్యక్షులు మొహమ్మద్ ఖాదర్ ఖాన్ గారికి ట్రస్టు తరుపున ఘనంగా సత్కరించారు, ఈ కార్యక్రమానికి శ్రీ పోతుల వీరభద్ర ట్రస్ట్ అధ్యక్షులు బి విఎస్ మూర్తి గారు అధ్యక్షత వహించగా, మాజీ డిస్టిక్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ శ్రీ ఆకుల వీర్రాజు గారు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలనాయుడు, ట్రస్ట్ సభ్యులు మేడ గురుదత్ ప్రసాద్ పాల్గొని శ్రీ వీరభద్ర రావు గారికి నగరంతో ఉన్న అనుబంధాన్ని ఆయన చేసిన సేవ కార్యక్రమాలను సభకు వివరించారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు జగన్నాథం వెంకటరెడ్డి, రెడ్డి రాజు, తోట సుబ్బారావు,బేరులాల్ జైన్, కూరగంటి సతీష్, అయ్యల గోపి, తూర్పుగోదావరి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జె. వి. వి. అప్పారెడ్డి, కోశాధికారి కే. సత్యనారాయణ, డాక్టర్ జె. మహాలక్ష్మి టౌన్ హాల్ లైబ్రేరియన్ వి. టి. వి.సుబ్బారావు మోర భరద్వా జ్, కర్రి సూర్యనారాయణ, మంచాల సునీల్, యర్ర రంగబాబు మరియు అనేకమంది పిఈటి సంఘం సభ్యులు టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు నగర ప్రముఖులు పాల్గొని వీరభద్ర రావు గారికి నివాళులు అర్పించారు.

జనరల్ న్యూస్
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

తొలిసారి జిల్లాకు విచ్చేసిన ప్రత్యేక అధికారి కె.ఆమ్రపాలికి

## కలెక్టర్ వెట్రిసెల్వి సాదర స్వాగతం



ఏలూరు ఏప్రిల్ 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏలూరు జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై పర్యవేక్షణకు రాష్ట్ర ప్రభుత్వంచే నియమించబడిన అనంతరం తొలిసారిగా జిల్లాకు విచ్చేసిన ప్రత్యేక అధికారి కె. ఆమ్రపాలి కి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి బుధవారం పూలమొక్కను అందించి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలు జరుగుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గురించి కలెక్టర్ కె. వెట్రిసెల్వి ని ప్రత్యేక అధికారి ఆమ్రపాలి అడిగి తెలుసుకున్నారు. జిల్లాను వ్యవసాయపరంగానే కాక పారిశ్రామికంగా రాష్ట్రస్థాయిలో అభివృద్ధిపథంలో నిలిపేందుకు తీసుకోవలసిన చర్యలపై జిల్లా అధికారి మరియు ప్రత్యేక అధికారి కలిసి చర్చించారు. జిల్లాలో పర్యాటకాభివృద్ధికి అనువైన అంశాలు, కొల్లేరు, పాపికొండలు, పోలవరం ప్రాజెక్ట్ ప్రాంతాలలో పర్యాటకంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్ వెట్రిసెల్వి తో ఆమ్రపాలి చర్చించారు.

## సోషల్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

ఏలూరు సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఇమ్మానియేల్



ఏలూరు ఏప్రిల్ 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏలూరులోని సర్వజన ఆసుపత్రికి నిత్యం వందలాదిగా రోగులు వారి బంధువులు వస్తుంటారని వీరందరికీ వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఉపయోగపడతాయని ఏలూరులోని సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఇమ్మానియేల్ అన్నారు. ఏలూరులోని గవర్నమెంట్ ఆసుపత్రి వద్ద ఈరోజు సోషల్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఫాదర్ బాల ,ఫాదర్ ఇమ్మానుయేల్, ఫాదర్ అమర్నాథ్, ఫాదర్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ఫాదర్ లు మాట్లాడుతూ ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు పీఠాధిపతిగా 34 సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా పేద ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో ఇతర చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ ఏలూరు డెవలప్మెంట్ అధినేత అజయ్ బాబు పలువురు సంఘ పెద్దలు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ ను కలిసి పలు సమస్యలను విన్నవించిన సిపిఎం సభ్యులు.



భీమవరం, ఏప్రిల్02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం చాంబర్ నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ని సిపిఎం సభ్యుల బృందం కలిసి జిల్లాలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు రావడం జరిగింది. పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా సిపిఎం ప్రజా చైతన్య సైకిల్ యాత్రను మార్చి 8 నుండి మార్చి 17 వరకు నిర్వహించడం జరిగిందని దీనిలోని భాగంగా జిల్లాలోని కొన్ని సమస్యలు మా దృష్టికి రావడం జరిగిందన్నారు. 2019 - 24 మధ్య ప్రభుత్వం ఏర్పాటుచేసిన కాలనీలోని కొన్నింటికి దారి మార్గం లేదని, రోడ్ల నిర్మాణ సమస్య ఉందని, మంచినీటి సమస్య, విద్యుత్ సమస్య, డ్రైనేజీ సమస్య, టిడ్కో ఇళ్ళు, తదితర సమస్యలు కాలనీలలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ కు వివరించి పరిష్కారం చూపాలని కోరడం జరిగింది. ఈ విషయమై జిల్లా కలెక్టర్ చదలగూడ నాగరాణి స్పందిస్తూ జిల్లా స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను పరిశీలిస్తామని, అలాగే పేదల కాలనీలు, టిడ్కో ఇళ్ళు సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయని, వీటి పరిష్కారానికి ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. పేద, ఎస్సీ, ఎస్టీ వర్గాల పిల్లలు స్కూల్ డ్రాప్ అవుట్స్ లేకుండా ప్రతి ఒక్కరు చదువుకునేలా చైతన్యం కలిగించాలని కోరారు. అలాగే ఉద్యోగ దిక్సూచి ద్వారా కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకునేలా చూడాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి జె.ఎన్.వి గోపాలన్, సభ్యులు బి.వాసుదేవరావు, కౌరు పెద్దిరాజు, సివి ప్రతాప్, జిల్లా కమిటీ సభ్యులు దూసి కళ్యాణి, పుగాకు పూర్ణ, జక్కంశెట్టి సత్యనారాయణ, కె.క్రాంతి బాబు, గోర్ల రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

# అభివృద్ధి, సంక్షేమంలో జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలపాలి

జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తో కలిసి అధికారులతో సమీక్షించిన సంక్షేమ పథకాల అమలు పర్యవేక్షణ జిల్లా ప్రత్యేక అధికారి కె. ఆమ్రపాలి

ఏలూరు ఏప్రిల్ 02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ఏలూరు జిల్లా ను రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపేందుకు అధికారులు కృషి చేయాలనీ సంక్షేమ పథకాల అమలు పర్యవేక్షణ ఏలూరు జిల్లా ప్రత్యేక అధికారి కె. ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో బుధవారం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తో కలిసి జిల్లాలో అమలు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యాలయాల అమలును వివిధ శాఖల అధికారులతో జిల్లా ప్రత్యేక అధికారి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమ్రపాలి మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల అధికారులు తమకు కేటాయించిన లక్ష్యాలను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేసి, ఏలూరు జిల్లాను రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు లభించేలా ప్రగతిపథంలో నిలపాలన్నారు. వ్యవసాయ ప్రధానమైన ఏలూరు జిల్లాలో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంను పెంపొందించేందుకు రైతులకు ప్రభుత్వం అందించే చేయూతపై రైతులకు అవగాహన కలిగించి, మరింత విస్తీర్ణంలో సాగుచేసేలా చూడాలన్నారు. ఉద్యానవన పంటలకు, ఆక్వా పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కల్పించనున్న పనిదినాలు, చేపట్టవలసిన పనులపై రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక ను అడిగి తెలుసుకున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను, జిల్లాలో సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్ట్ , పాపికొండలు, కొల్లేరు ప్రాంతాలలో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు.

జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 2. 65 లక్షల మంది పేదలకు ప్రతీనెలా 112. 50 కోట్ల రూపాయలు సామాజిక పెన్షన్లుగా అందిస్తున్నామని, మొదటిరోజే దాదాపు 98 శాతం వరకు పెన్షన్ల పంపిణీ పూర్తిచేస్తున్నామన్నారు. ఏలూరు జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళలు చేసే వివిధ రకాల ఉత్పత్తులకు బ్రాండ్ ఇమేజ్ కల్పించి, ఆన్లైన్ మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు చేసిన ఉత్పత్తులు రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజు 2. 50 లక్షల ఉత్పత్తులు ఆన్లైన్ ద్వారా అమ్మకాలు జరిగి గిన్నిస్ బుక్ లో స్థానం సంపాదించారని, 50 ఉత్పత్తులు అమ్మకాలతో ఏలూరు జిల్లా మూడవ స్థానం సంపాదించిందన్నారు. జిల్లాలో వ్యవసాయం, అనుబంధ రంగాలలో ప్రగతిని సాగిస్తున్నామని, ఉద్యానవన పంటలలో ఆయిల్ పామ్ అధిక విస్తీర్ణంలో సాగవుతుందన్నారు. అదేవిధంగా కోకో పంటను ఆయిల్ పామ్, కొబ్బరి తోటలలో అంతర పంటగా 35 వేల సాగవుతున్నదని, మిరియాలు, యాలకులు, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, వంటి పంటలకు అనుకూల పరిస్థితులు కల్పించి జిల్లాలో ఔత్సాహిక రైతులు సాగుచేస్తున్నారన్నారు. జిల్లాలో 31 జాబ్ మేళాలు నిర్వహించి 1657 మంది యువతకు వివిధ పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. వ్యవసాయ ప్రధానమైన ఏలూరు జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు అనువైన పరిస్థితులు ఉన్నాయని, వాటిని నెలకొల్పేందుకు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వయం సహాయక సంఘాలతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. .

సమావేశంలో డిఎఫ్ ఓ శుభం, డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈఓ కె. భీమేశ్వరరావు, డిఆర్డీఏ, డ్వామా పీడీ విజయరాజు, కె. వి. సుబ్బారావు, ఎక్సయిజ్ శాఖ డిప్యూటీ కమీషనర్ శ్రీలత, వ్యవసాయాధికారి హబీబ్ బాషా, పశుసంవర్ధక శాఖ జెడి డా. గోవిందరాజులు, డిపిఓ అనురాధ, డిఎస్ఓ ప్రతాప్ రెడ్డి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, ఉద్యానవనాల శాఖ డిడి రామ్మోహన్,పంచాయత్ రాజ్,ఆర్ డబ్ల్యూ ఎస్, ఆర్అండ్ బి ఎస్ఈ లు రమణమూర్తి, త్రినాథ్ బాబు, పి . వి. రత్నం, డిసిహెచ్ఎస్ డా. పాల్ సతీష్, ప్రభృతులు పాల్గొన్నారు.



# పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు

మూడు గ్రామాల్లో రూ కోటి 90 లక్షలతో నిర్మించిన12 సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు, మాజీ ఎంపీ సీతారామలక్ష్మి

భీమవరం, ఏప్రిల్02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పల్లెలు దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని, ఇదే నినాదంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండలంలోని మూడు గ్రామాల్లో సుమారు రూ కోటి 90 లక్షలతో 12 సీసీ రోడ్లను బుధవారం ఎమ్మెల్యే అంజిబాబు, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ప్రారంభించారు. కొమరాడ గ్రామంలో రూ 91 లక్షల నిధులతో 5 సీసీ రోడ్లు, అనాకోడేరు గ్రామంలో రూ 39 లక్షలతో 5 సీసీ రోడ్లు, గొల్లవానితిప్ప గ్రామంలో రూ 60 లక్షలతో 2 సీసీ రోడ్లను మొత్తం రూ ఒక కోటి 90 లక్షల నిధులతో 12 సీసీ రోడ్లను ప్రారంభించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న పనులు, సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టమని, గ్రామాల అభివృద్ధితో అసలైన పండుగ వాతావరణం తీసుకొచ్చమని అన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కీలక అడుగు వేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రహదారులపై గుప్పెడు మట్టైయినా వేయలేదని, ఎక్కడ చూసినా రహదారులు గోతులమయంతో దర్శనమిచ్చేవని, కూటమి ప్రభుత్వం 9 నెలల్లోనే అన్ని రోడ్ల పనులను పూర్తి చేసి ప్రారంభించుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, వబిలిశెట్టి రామకృష్ణ, యర్రంశెట్టి శివకృష్ణ, ప్రెసిడెంట్ రత్నాల పేరయ్య, బిజెపి అధ్యక్షులు రత్నాల సత్యనారాయణ, నీటి సంఘం ప్రెసిడెంట్ గంజాల మాణిక్యాలరావు, గొంతు గణపతి రావు, సుబ్రహ్మణ్యం, ఆయా గ్రామాల సర్పంచ్ లు, ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు పాల్గొన్నారు.





# సమాజ సేవలో అందరూ భాగస్వాములు కావాలి

జెడ్పీటీసీ జయప్రకాష్ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు

భీమవరం, ఏప్రిల్02 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

సమాజ సేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పలువురు వక్తలు అన్నారు. వీరవాసరం జనసేన జెడ్పీటీసీ గుండా జయప్రకాష్ నాయుడు పుట్టినరోజు సందర్భంగా బుధవారం పట్టణంలో జెపి యూత్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా మావుళ్ళమ్మ, నందమూరి గరువు ఆంజనేయ స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. వేంకటేశ్వర బధిర పాఠశాలలో విద్యార్థులకు విద్య సామాగ్రి, స్వీట్స్, బిస్కెట్స్, కూల్ డ్రింక్స్ పంపిణీ చేశారు. చిన అమిరంలోని ఇమ్మాన్యుయేలు అనాథ ఆశ్రమంలోని చిన్నారులకు, పెద అమిరంలోని అరుణోదయ మనో వికాస కేంద్రంలోని చిన్నారులకు అన్నదానం చేశారు. జనసేన రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి ఉండపల్లి రమేష్ నాయుడు, బిజెపి కో కన్వీనర్ చెరుకూరి వెంకట కృష్ణంరాజు, టిడిపి చిరుకూరి రామకృష్ణ చౌదరి కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. జెపి యూత్ సభ్యులు ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సేవా కార్యక్రమాలతో తోటివారికి స్ఫూర్తిగా నిలవాలని, అభిమానులు సమాజసేవలో ఎల్లప్పుడూ ముందు ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మెగా ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు చల్లా రాము, జాడ చిన్నా, చింతా లక్ష్మణ్, మునగాల సంజయ్, నాగిడి శ్యామ్, బొంతు శ్రీనివాస్, గంధం భరత్ తదితరులు పాల్గొన్నారు.



# ముంబయికి యశస్వి జైశ్వాల్ గుడ్‌బై

**ముంబయి:**

**యువ బ్యాట్స్‌మన్ యశస్వి జైస్వాల్ షాకింగ్ నిర్ణయం తీసుకున్నాడు. దేశవాళీల్లో కొంతకాలం నుంచి ముంబయి తరఫున ఆడుతున్న అతడు.. ఉన్నట్టుండి ఆ జట్టుకు గుడ్‌బై చెప్పాడు. ఈ మేరకు ముంబయి క్రికెట్ అసోసియేషన్‌కు లేఖ రాశాడు. గోవాకు మారేందుకు తనకు నిరభ్యంతర పత్రం ఇవ్వాలని కోరాడు. అతడి అభ్యర్థనను జట్టు పాలక వర్గం కూడా అంగీకరించినట్లు తెలిసింది.**



"ఇది చాలా ఆశ్చర్యకరమైన పరిణామం. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం వెనుక ఏదైనా కారణం ఉండొచ్చు. అతడి రిక్వెస్ట్‌ను అంగీకరించి జట్టు నుంచి రిలీవ్ చేశాం" అని ముంబయి క్రికెట్ అసోసియేషన్ అధికారి ఒకరు బుధవారం పీటీఐకి వెల్లడించారు. వ్యక్తిగత కారణాలతోనే తాను జట్టు మారుతున్నట్లు జైస్వాల్ తన లేఖలో పేర్కొన్నాడు. దీంతో 2025-26 సీజన్ నుంచి ఈ లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్ గోవా తరఫున దేశవాళీ క్రికెట్‌కు ప్రాతినిధ్యం వహించనున్నాడు.

ఈ మధ్యకాలంలో దేశవాళీలో ముంబయి వీడిన మూడో ఆటగాడు జైస్వాల్. అంతకుముందు 2022-23 సీజన్ సమయంలో క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ కుమారుడు అర్జున్, మరో క్రికెటర్ సిద్ధేశ్ లాడ్ కూడా ముంబయిని వీడి గోవాకు మారారు. ఇక, తాజా పరిణామాలపై గోవా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ శాంబ దేశాయ్ స్పందించారు. జైస్వాల్‌ను తమ జట్టులోకి ఆహ్వానిస్తున్నామని తెలిపారు. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించని సమయంలో గోవాకు అతడు కెప్టెన్‌గానూ వ్యవహరించే అవకాశాలున్నట్లు పేర్కొన్నారు.

2019లో జైస్వాల్ ముంబయి జట్టులో చేరాడు. అప్పటి నుంచి అన్ని ఫార్మాట్లలో కలిపి 63 మ్యాచ్‌లు ఆడాడు. రంజీల్లో 10, లిస్ట్ ఏలో 25, టీ20ల్లో 28 మ్యాచ్‌లకు ప్రాతినిధ్యం వహించాడు. రంజీల్లో 863 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలు, రెండు అర్ధశతకాలు ఉన్నాయి. ఇటీవల జాతీయ జట్టు ఆటగాళ్లు దేశవాళీల్లోనూ ఆడాలని బీసీసీఐ ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో ఈ ఏడాది జనవరిలో జమ్మూకశ్మీర్‌తో జరిగిన మ్యాచ్‌లో జైస్వాల్ ఆడగా.. 4, 26 పరుగులతో పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు.

# ఈ- క్రికెట్ ప్రీమియర్ లీగ్‌లో ముంబయి ఫ్రాంచైజీ కొనుగోలు చేసిన సారా తెందూల్కర్



**క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ కుమార్తె సారా తెందూల్కర్.. గ్లోబల్ ఈ-క్రికెట్ ప్రీమియర్ లీగ్ (జీఈపీఎల్) రెండో సీజన్‌లో ముంబయి ఫ్రాంచైజీకి యజమానురాలుగా మారింది. ఈ విషయాన్ని డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ టెక్నాలజీలో గ్లోబల్ లీడర్‌గా ఉన్న జెట్‌సింథెసిస్ ధ్రువీకరించింది. ముంబయి ఫ్రాంచైజీకు సారా యాజమాన్య బాధ్యతలు స్వీకరించడం ఆమెకు ఈ ప్రాంతంతో ఉన్న బలమైన అనుబంధానికి తార్కాణం అంది. డిజిటల్ యుగంలో క్రికెట్ విస్తృతి పెంచడం అనే లీగ్ లక్ష్యాన్ని ఆమె చేరిక మరింత బలపరుస్తుందని అభిప్రాయపడింది.**

'ముంబయి ఫ్రాంచైజీను సారా తెందూల్కర్ కొనుగోలు చేయడం మాకు చాలా ఆనందంగా ఉంది. ఆమె తీసుకున్న ఈ నిర్ణయం జీఈపీఎల్ పరిధిని విస్తరించడానికి, అభిమానులతో కనెక్ట్ కావడానికి మాకు ఎంతో సహాయపడుతుంది' అని జెట్‌సింథెసిస్ సీఈఓ, ఫౌండర్ రాజన్ నవనీ అన్నారు. 'క్రికెట్ మా కుటుంబంలో అంతర్భాగం. జీఈపీఎల్‌లో ముంబయి ఫ్రాంచైజీ సొంతం చేసుకోవాలనే నా కల నిజమైంది. ఆట మీద నాకున్న ప్రేమే దీనికి కారణం. స్ఫూర్తిని, వినోదాన్ని అందించే ఈ-స్పోర్ట్స్ ఫ్రాంచైజీను ముందుకు నడిపించడానికి మా ప్రతిభావంతులైన బృందంతో కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఉన్నాను' అని ఆమె వెల్లడించారు.

జీఈపీఎల్ అనేది ప్రపంచంలోనే అతిపెద్ద ఈ- క్రికెట్ లీగ్. ఈ రియల్ క్రికెట్ ఇప్పటి వరకు 30 లక్షల డౌన్‌లోడ్లకు చేరుకుంది. జియోసినిమా, స్పోర్ట్స్ 18లో 24 లక్షల నిమిషాల వీక్షణ సమయాన్ని పూర్తి చేసుకుంది.

# టాప్ ర్యాంకుల్లో గిల్, పాండ్య..

## టీ20ల్లో నంబర్ వన్ బౌలర్‌గా డఫీ

**గత రెండు వారాలుగా టీమ్ఇండియా ఆటగాళ్లు అంతర్జాతీయ మ్యాచుల్లో ఆడటం లేదు. అయినాసరే ఐసీసీ ర్యాంకుల్లో కొందరు టాప్‌లోనే కొనసాగుతుండగా.. పలువురు మాత్రం కాస్త కిందికి పడిపోయారు. అయితే, టీ20ల్లో కివీస్‌కు చెందిన బౌలర్ జాకబ్ డఫీ (723 పాయింట్లు) అగ్రస్థానంలోకి దూసుకొచ్చాడు. ఇలా ఏ ఫార్మాట్‌లోనైనా టాప్ ర్యాంక్‌ను అందుకొన్న కివీస్ పేస్ బౌలర్‌గా నిలిచాడు. నాలుగు స్థానాలను ఎగబాకి అగ్రస్థానంలోకి చేరాడు. అంతకుముందు 2018లో న్యూజిలాండ్ నుంచి ఐష్ సోధి మాత్రమే ఇలా టాప్‌లోకి వెళ్లాడు. కానీ, అతడు స్పిన్నర్. ఇక టీ20 బౌలర్ల జాబితాలో అకీల్ హుసేన్ (707), భారత మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (706) ఒక్కో ర్యాంకు దిగజారి తర్వాత స్థానాల్లో కొనసాగుతున్నారు.**



### ఆల్‌రౌండర్ అతడే..

భారత స్టార్ ఆటగాడు హార్దిక్ పాండ్య (252) టాప్ ఆల్‌రౌండర్‌గా కొనసాగుతున్నాడు. ఈ జాబితాలో టాప్ -10లో మరే ఇతర టీమ్ఇండియా ప్లేయర్ లేకపోవడం గమనార్హం. 12వ స్థానంలో అక్షర్ పటేల్ (161) నిలిచాడు. బ్యాటింగ్ విభాగంలో మాత్రం టాప్ -10లోనే భారత్ నుంచి ముగ్గురు బ్యాటర్లకు అవకాశం దక్కింది. రెండో స్థానంలో అభిషేక్ శర్మ (829), నాలుగో స్థానంలో తిలక్ వర్మ (804), ఐదో ర్యాంకులో సూర్య కుమార్ యాదవ్ (739) కొనసాగుతున్నారు. ఆసీస్ డేంజరస్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ (856)దే అగ్రస్థానం.

### వన్డే బెస్ట్ బ్యాటర్‌గా..

వన్డేల్లో భారత క్రికెటర్ శుభ్‌మన్ గిల్ (784) అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. పాక్ ఆటగాడు బాబర్ అజామ్ (777) తర్వాత ప్లేస్‌లో ఉన్నాడు. టీమ్ఇండియా సారథి రోహిత్ శర్మ (756) మూడో స్థానం, విరాట్ కోహ్లి (736) ఐదో స్థానం, శ్రేయస్ అయ్యర్ (704) ఎనిమిదో స్థానంలో నిలిచారు. వన్డే బౌలర్ల జాబితాలో టాప్ -10 నుంచి ఇద్దరు టీమ్ఇండియా ప్లేయర్లు ఉన్నారు. ఒక్క స్థానం మెరుగుపర్చుకుని కుల్‌దీప్ యాదవ్ (650) మూడో ర్యాంకుకు చేరాడు. రవీంద్ర జడేజా (616) ఒక ర్యాంకు పైకి చేరి 9వ స్థానంలో కొనసాగుతున్నాడు.

# కోహ్లికి ఓ కారణం ఉంది..

## దిగ్వేశ్ చేయడంలో అర్థం లేదు: గావస్కర్



**ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ వరుసగా రెండో విజయం సాధించింది. లఖ్‌నవూ తన సొంత మైదానంలోనే ఓటమి పాలైంది. అయితే, ఎల్ఎస్‌జీ స్పిన్నర్ దిగ్వేశ్ రాఠి తీరే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. పంజాబ్ ఓపెనర్ ప్రియాంశ్ ఆర్యను ఔట్ చేసిన తర్వాత కెస్రిక్ విలియమ్స్ తరహాలో 'సంతకం' సంబరాలు చేసుకున్నాడు. పెవిలియన్ వైపు వెళుతున్న ప్రియాంశ్ దగ్గరకు పరుగెత్తుకు వెళ్లి 'నీ వికెట్‌ను నా ఖాతాలో వేసుకున్నా' అనే అర్థం వచ్చేలా చేతిమీద సంతకం చేసి చూపించాడు. గతంలో విరాట్ కోహ్లి కూడా ఇలాగే చేశాడని.. అందుకు కారణముందని భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ కామెంట్రీలో పేర్కొన్నాడు. ఇప్పుడు దిగ్వేశ్ చేయడంలో అర్థం లేదనిపిస్తోందని వ్యాఖ్యానించాడు.**

### పంజాబ్ దంచేసింది

"బ్యాటర్ లేదా బౌలర్ సంబరాలు చేసుకోవడంలో తప్పు లేదు. వికెట్ దక్కితే ఆ బౌలర్ ఆనందానికి అంతేమీ ఉండదు. ముందు బంతికి సిక్స్ లేదా ఫోర్ కొట్టాక వికెట్ లభిస్తే ఇలా సంబరపడటం తప్పేమీ కాదు. అలాకాకుండా వరుసగా 5 బంతులు డాట్స్‌గా వేసి ఆఖరి బంతికి వికెట్ తీసినప్పుడు ఇలాంటి సంబరాలు చేసుకోవడంలో అర్థం లేదు. గతంలో విరాట్ కోహ్లి కూడా ఇలా చేశాడు. కానీ, అందుకు ఓ కారణం ఉంది. ఆ సిరీస్‌లో (2017) విరాట్ ఔటైనప్పుడు కెస్రిక్ విలియమ్స్ ఇలా ప్రవర్తించాడు. ఆ తర్వాత మ్యాచ్‌లో విలియమ్స్ బౌలింగ్‌లోనే వరుసగా బౌండరీలు కొట్టిన కోహ్లి 'సంతకం' హావభావాలు వ్యక్తంచేశాడు" అని గావస్కర్ వెల్లడించాడు.

### దిగ్వేశ్‌కు పంజాబ్ ఫ్యాన్స్ కౌంటర్

లఖ్‌నవూ బౌలర్ దిగ్వేశ్‌కు పంజాబ్ ఫ్యాన్స్ మ్యాచ్ సమయంలోనే కౌంటర్ ఇచ్చారు. తమ జట్టు గెలుస్తుండటంతో పంజాబ్ అభిమానులు కూడా దిగ్వేశ్‌ను అనుకరిస్తూ సంతకం చేస్తున్నట్లుగా సంబరాలు చేసుకోవడం గమనార్హం. దిగ్వేశ్‌ను ఫీల్డ్ అంపైర్ కూడా మందలించడం ఇప్పటికే వీడియోల్లో చూశాం. మరోవైపు దిగ్వేశ్‌పై ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ చర్యలు తీసుకుంది. ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనకు పాల్పడటంతో 25 శాతం వరకు మ్యాచ్ ఫీజులో జరిమానా విధించింది. దిగ్వేశ్, ప్రియాంశ్ గత సీజన్‌లో దిల్లీ ప్రీమియర్ లీగ్‌లో ఒకే జట్టుకు ఆడటం గమనార్హం.

# 99 పరుగులతో సెంచరీ మిస్.. బాబర్ అజామ్‌పై ట్రోలింగ్

**పాకిస్థాన్ స్టార్ ఆటగాడు బాబర్ అజామ్‌పై మళ్లీ ట్రోలింగ్ మొదలైంది. న్యూజిలాండ్‌తో ఇప్పుడు పాక్ మూడు వన్డేల సిరీస్ ఆడుతోంది. ఇప్పటికే మొదటి మ్యాచ్‌లో ఓడిన పాక్‌కు రెండో వన్డే అత్యంత కీలకం. కానీ, ఇందులోనూ టాప్ ఆర్డర్ బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ 293 పరుగులను పాక్‌కు లక్ష్యంగా నిర్దేశించింది. అయితే పాక్ 208 పరుగులకే ఆలౌటైంది. ఆరో స్థానంలో వచ్చిన ఫహీద్ అష్రాఫ్ (73), బౌలర్ నసీమ్ షా (51) హాఫ్ సెంచరీలు సాధించడంతో ఈ మాత్రం స్కోరునైనా చేయగలిగింది.**




న్యూజిలాండ్ బౌలర్ల దెబ్బకు పాకిస్థాన్ విలవిల్లాడిపోయింది. 32 పరుగులకే సగం వికెట్లను... 114 రన్స్‌కే 8 వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ రిజ్వాన్ (5), బాబర్ అజామ్ (1), అబ్దులా షఫీక్ (1), ఇమాముల్ హక్ (3), సల్మాన్ అఘా (9) సింగిల్ డిజిట్‌కే పరిమితయ్యారు. ఆ సమయంలో ఫహీమ్- నసీమ్ షా కలిసి తొమ్మిదో వికెట్‌కు 60 పరుగులు జోడించారు. కానీ, ఈ పోరాటం ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించింది. కివీస్ బ్యాటర్లు పరుగులు చేసిన పిచ్‌పై పాక్ టాప్ ఆర్డర్ ఘోరంగా విఫలం కావడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. మరీ ముఖ్యంగా బాబర్ అజామ్‌పై విపరీతమైన ట్రోలింగ్ మొదలైంది.

"బాబర్ అజామ్ కొద్దిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. మరో 99 పరుగులు చేస్తే సరిపోయేది. పాకిస్థాన్‌కు బాబర్ ప్రధాన సమస్యగా మారిపోయాడు"

"బాబర్ జట్టులో లేనప్పుడూ పాక్ ఓడింది. జట్టులో ఉన్నా పరాజయం పాలైంది. ఇలాంటప్పుడు మాజీలు మాత్రం ఎవరూ మాట్లాడరు. టీ20 సిరీస్ సమయంలో కుర్రాళ్లపై మాత్రం ఆగ్రహం వ్యక్తం చేశారు"

"మ్యాచ్‌కు ముందు ఒకరు 32వ సెంచరీ సిద్ధమవుతోందని పోస్టు పెట్టారు. అవును నిజంగానే లోడ్ అయింది. అది 0 నుంచి 1కి మారింది. శతకం కోసం మరో 99 పరుగులు చేయాలి"

CINIMA NEWS
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక



# పరికిణీలో నభా అందాల జాతర.. చూస్తే ఫ్లాటే

గ్లామరస్ బ్యూటీ నభా సోషల్ మీడియాలో లేటెస్ట్ ఫొటోలను షేర్ చేసింది. సాంప్రదాయ కట్టు బొట్టులో నభా అందాలు ఫిదా చేస్తున్నాయి. ఈ ఫొటోలను మీరు కూడా చూసేయండి.

# 'గ్యాంగర్స్' ట్రైలర్ విడుదల



దర్శక నిర్మాత, నటుడు సుందర్ సి. ప్రస్తుతం 'గ్యాంగర్స్' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమాలో సుందర్‌తో పాటు వడివేలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. దాదాపు 15 సంవత్సరాల తర్వాత వీరిద్దరూ కలిసి చేస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రం ఏప్రిల్ 24న రాబోతోంది. ఈ సందర్భంగా తాజాగా మూవీ ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమాలో పీటీ మాస్టర్‌గా సుందర్ సి నటిస్తుంటే, అదే పాఠశాలలో అతనికి సీనియర్‌గా వడివేలు నటించారు. కేథరిన్ థ్రెసా, భగవతి పెరుమాళ్, మైమ్ గోపీ, హరీశ్ పేరడి ఇతర కీలక పాత్రలను చేశారు. ఎ.సి.ఎస్. అరుణ్ కుమార్ సమర్పణలో కుష్బు ఈ సినిమాని నిర్మిస్తున్నారు.

# సంగీత్ శోభన్ హీరోగా మరో సినిమాను నిర్మిస్తోన్న నిహారిక కొణిదెల




హైదరాబాద్ బ్యూరో : ప్రముఖ నటి, నిర్మాత నిహారిక కొణిదెల 2024లో విడుదలైన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకుని తెలుగు చిత్రపరిశ్రమలో సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్‌గా తన మార్క్‌ను క్రియేట్ చేశారు. ఈ సినిమాలో నటించిన నటీనటుల్లో ఎక్కువ మంది కొత్తవారే కావటం విశేషం. తాజాగా నిహారిక తన నిర్మాణ సంస్థ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై రెండో చిత్రాన్ని ప్రారంభించనున్నారు. ఈ సినిమాకు మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాల్లో అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న ప్రతిభావంతుడైన యువ కథానాయకుడు సంగీత్ శోభన్ ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. సంగీత్ సోలో హీరోగా నటించనున్న తొలి సినిమా ఇదే. మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు రానున్న రోజుల్లో వెల్లడికానున్నాయి. ఇది వరకే నిహారిక రూపొందించిన వెబ్ ప్రాజెక్ట్సులో హీరో సంగీత్ శోభన్, డైరెక్టర్ మానస శర్మ భాగమయ్యారు. జీ5తో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ రూపొందించిన వెబ్ సిరీస్ 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'కి మానస శర్మ రచయితగా.. సోనీ లివ్ రూపొందించిన 'బెంచ్ లైఫ్'కి దర్శకురాలిగా పని చేశారు. తాజాగా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ రూపొందించనున్న ఈ సినిమాతో మానస శర్మ ఫీచర్ ఫిల్మ్ డైరెక్టర్‌గా ఆంగేట్రం చేస్తున్నారు. ఇక సంగీత్ శోభన్ విషయానికి వస్తే 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'లో ప్రధాన పాత్రలో నటించారు. ఈ చిత్రానికి మానస శర్మ కథను అందించగా మహేష్ ఉప్పల కో రైటర్‌గా స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు. మన్యం రమేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. నిహారిక కొణిదెల నిర్మిస్తోన్న ఈ చిత్రానికి సురేంద్ర కుమార్ నాయుడు %-% ఫణి కందుకూరి (బియాండ్ మీడియా) పిఆర్వోగా, టికెట్ ఫ్యాక్టరీ మార్కెటింగ్ వ్యవహారాలను నిర్వహిస్తున్నారు.

# 'బ్యాట్‌మ్యాన్' మరణం

టాప్ గన్, బ్యాట్‌మ్యాన్ ఫరెవర్ మరియు ది డోర్స్ చిత్రాలలో తన పాత్రలకు ప్రసిద్ధి చెందిన హాలీవుడ్ స్టార్ వాల్ కిల్మర్ (65) మరణించారు. ఈ వార్తను అతని కుమార్తె మెర్సిడెస్ కిల్మర్ ది న్యూయార్క్ టైమ్స్ ద్వారా ధృవీకరించారు. 2014లో గొంతు క్యాన్సర్ నిర్ధారణ తర్వాత అనేక సంవత్సరాల పాటు ఆరోగ్య సమస్యల తర్వాత అతను న్యుమోనియాతో మరణించాడని పేర్కొన్నారు. 1980ల నాటి అనేక చిత్రాలలో నటించిన ఆయనకు 1986 నాటి టాప్ గన్ మంచి నటుడిగా గుర్తింపు నిచ్చింది. 1995లో బాబ్ కేన్, బిల్ ఫింగర్ రూపొందించిన డిసి కామిక్స్ క్యారెక్టర్ బ్యాట్‌మ్యాన్ ఆధారంగా రూపొందించబడిన చిత్రంతో బ్యాట్‌మ్యాన్ ఫరెవర్ తో ప్రేక్షకుల మదిలో నిలిచిపోయాడు.





# అలాంటి వాళ్ళకే అవకాశాలు..మాకివ్వరు..?

## పాయల్ రాజ్ పుత్!

'సినీ ప్రపంచం లో నటుడిగా/ నటిగా కొనసాగడం అనేది అత్యంత కఠినమైన పరిస్థితులలో ఒకరి. ప్రతీ రోజు ఎదో తెలియని భయం తో మన రోజు మొదలవుతుంది. ఇండస్ట్రీ లో నెపోటిజం రాజ్యం ఏలుతుంది. నిజమైన టాలెంట్ ఈ నెపోటిజం ముసుగులో కనుమరుగు అయిపోతుంది. నేను పడే కష్టానికి తగ్గ ఫలితం, నా టాలెంట్ కి తగ్గ అవకాశాలు భవిష్యత్తులో అయినా వస్తాయా లేదా అని ఆలోచించినప్పుడు రావేమో అని భయం వేస్తుంది.

మన టాలీవుడ్ లో అందం, నటన రెండు ఉన్న హీరోయిన్లు దొరకడం చాలా అరుదు. కానీ ఆ రెండు ఉన్నప్పటికీ అదృష్టం కలిసిరాక పెద్ద రేంజ్ కి వెళ్లని హీరోయిన్స్ కొంతమంది ఉన్నారు. వారిలో ఒకరు పాయల్ రాజ్ పుత్. బాలీవుడ్ లో సీరియల్స్ ద్వారా మంచి క్రేజ్ ని సంపాదించిన ఈ అమ్మాయి, తెలుగు లో %=ఆ%100 చిత్రం ద్వారా మన ఆడియన్స్ కి పరిచయమైంది. ఈ సినిమాలో విలన్ గా ఆమె నటన ఏ రేంజ్ లో ఆడియన్స్ ని అలరించిందో మనమంతా చూసాము. అయితే మొదటి సినిమాలోనే అంతటి విలన్ క్యారక్టర్ చేయడం వల్లో ఏమో తెలియదు కానీ, ఆమె పై ఆ సినిమా ప్రభావం చాలా బలంగా పడింది. అందుకే అవకాశాలు ఆశించిన స్థాయిలో రావడం లేదని పలువురి అభిప్రాయం. అయితే రీసెంట్ గానే ఆమె ట్విట్టర్ లో వేసిన కొన్ని ట్వీట్స్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి. ఆమె మాట్లాడుతూ 'సినీ ప్రపంచం లో నటుడిగా/ నటిగా కొనసాగడం అనేది అత్యంత కఠినమైన పరిస్థితులలో ఒకరి. ప్రతీ రోజు ఎదో తెలియని భయం తో మన రోజు మొదలవుతుంది. ఇండస్ట్రీ లో నెపోటిజం రాజ్యం ఏలుతుంది. నిజమైన టాలెంట్ ఈ నెపోటిజం ముసుగులో కనుమరుగు అయిపోతుంది. నేను పడే కష్టానికి తగ్గ ఫలితం, నా టాలెంట్ కి తగ్గ అవకాశాలు భవిష్యత్తులో అయినా వస్తాయా లేదా అని ఆలోచించినప్పుడు రావేమో అని భయం వేస్తుంది. ఎందుకంటే పెద్ద సినీ బ్యాక్ గ్రౌండ్ నుండి వచ్చిన వాళ్ళ కారణంగా అవకాశాలు నా చెయ్యి నుండి జారిపోవడం వంటివి చాలాసార్లు చూసాను. ఇలాంటివి తల్చుకున్నప్పుడు మనసుకి చాలా బాధగా ఉంటుంది' అంటూ పాయల్ రాజ్ పుత్ మాట్లాడిన మాటలు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యింది. ఆమె వ్యాఖ్యలకు సపోర్టుగా నెటిజెన్స్ కూడా నిలిచారు. %=ఆ%100 చిత్రంలో మీ నటన, అందాన్ని చూసి టాలీవుడ్ లో భవిష్యత్తులో పెద్ద స్టార్ హీరోయిన్ అయిపోతావని అనుకున్నామని, కానీ కనీసం మీడియం రేంజ్ హీరోయిన్ గా కూడా స్థిరపడనందుకు చింతిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రీసెంట్ గా ఇండస్ట్రీ ట్రెండింగ్ లో ఉన్నటువంటి కుర్ర హీరోయిన్స్ కి కనీసం ఎక్స్ ప్రెషన్స్ ఇవ్వడం కూడా రావడం లేదు. అలాంటోళ్ళు నేడు కోట్ల రూపాయిల రెమ్యూనరేషన్స్ ని అందుకుంటూ వేరే స్థాయిలో ఉంటున్నారు. కానీ మీరు మాత్రం ఇంకా ఇక్కడే ఉండిపోయారు, కచ్చితంగా మీకు జరుగుతున్నది అన్యాయమే, భవిష్యత్తులో అయినా మీ పెద్ద రేంజ్ కి వెళ్లాలని ఆశిస్తున్నాము అంటూ పాయల్ రాజ్ పుత్ కి ధైర్యాన్ని నింపే ప్రయత్నం చేసారు. ఆమె చివరిసారిగా వెండితెర మీద కనిపించిన చిత్రం 'మంగళవారం'. ఈ సినిమా తర్వాత మళ్ళీ ఆమె మరో సినిమాలో నటించడానికి సంతకం చేయలేదు.3

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339